

ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసిన మేయర్ దంపతులు(ఫైల్)

ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ పదవి విషయమై దోబూచులాట జరుగుతోంది. కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు క్యూ కట్టడంతో కార్పొరేషన్‌లో వైసీపీ అధిపత్యానికి గండిపడటం ఖాయమని తేలిపోయింది. రానురాను టీడీపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య పెరిగిపోతోంది. అదేసమయంలో మేయర్ గంగాడ సుజాత వ్యవహారశైలి చర్చనీయాంశమైంది. పూర్తి కాలం తనను మేయర్‌గా కొనసాగించేలా హామీ తీసుకొని టీడీపీలోకి అడుగు పెట్టాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఆ విషయాన్ని చంద్రబాబు తేల్చాల్సిందేనని ఎమ్మెల్యే జనార్దన్ ఆమెకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ మారే అంశంపై మేయర్ సుజాత నిర్ణయం వెల్లడి కాకపోగా.. వైసీపీ కార్పొరేటర్లు మాత్రం రోజుకు ఇద్దరు, ముగ్గురు టీడీపీలో చేరుతున్నారు. శుక్రవారం చోటుచేసుకున్న కొన్ని పరిణామాల అనంతరం ఈ విషయంలో తదుపరి నిర్ణయాలను ఎమ్మెల్యే జనార్దన్ సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది.

టీడీపీలో చేరిన మరో ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 9 : వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరారు. ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో ఆయన సమక్షంలో 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకటశేషయ్య కలిసి సైకిలెక్కారు. వారికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో దామచర్ల ఆధ్వర్యంలో సమావేశం

వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకునే విషయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో ఆయన స్వగ్రామమైన తూర్పు నాయుడుపాలెంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆ సమావేశానికి టీడీపీలో చేరేందుకు సిద్ధమైన మిగిలిన కార్పొరేటర్లను, ఆయా డివిజన్‌లలో గతంలో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారితోపాటు పార్టీ నాయకులను ఆహ్వానించనున్నారు. అక్కడ ఇరువురి అభిప్రాయం తెలుసుకోనున్నారు. ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు.



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

మేయర్ పదవిపై దోబూచులాట

- కార్పొరేటర్లు క్యూ కట్టడంతో టీడీపీకి మెజారిటీ
- పదవిపై హామీ కోసం సుజాత ప్రయత్నాలు
- చంద్రబాబుదే తుది నిర్ణయమన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- త్వరలో టీడీపీ నేతలతో ప్రత్యేక సమావేశం
- ఇదీ ఒంగోలు కార్పొరేషన్ రాజకీయం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ వైపు దృష్టి సారించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పక్షాన ఆరుగురు, జనసేన తరపున ఒకరు గెలుపొందారు. వైసీపీ నుంచి 42 మంది, స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఆతర్వాత స్వతంత్ర అభ్యర్థి కూడా వైసీపీలో చేరడంతో ఆ పార్టీ కార్పొరేటర్ల బలం 43కు చేరింది. అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభంకాగానే ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఆతర్వాత పేర్నమిట్ట ప్రాంత కార్పొరేటర్ సైకిలెక్కారు. గురువారం మరో నలుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం 50వ వార్డు కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, 17వ వార్డు కార్పొరేటర్ వెంకటశేషయ్య చేరారు. దీంతో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కార్పొరేటర్ల సంఖ్య 11కు చేరింది. టీడీపీ కూటమి బలం 18 అయింది. కాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ బుజ్జి, శాండిల్య పద్మావతి, అలాగే మూడో డివిజన్ కార్పొరేటర్ భర్త, రెండో డివిజన్ కార్పొరేటర్ గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది వైసీపీలో చేరిన గోపి ఉన్నారు. ఈ ఆరుగురు కూడా చేరితే కార్పొరేషన్‌లో కూటమి బలం 24కు చేరుతుంది. వీరు కాక కోఆప్షన్ సభ్యులుగా ఒంగోలు ఎంపీ మాగుంట, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్‌లు ఉంటారు. వారి ఓట్లతో కలిసి కార్పొరేషన్‌లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది

ఇక తేలాల్సింది మేయర్ వ్యవహారమే

నగర మేయర్ గంగాడ సుజాత గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిశారు. ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. మొదటి నుంచి మేయర్ సుజాత కచ్చితమైన నిర్ణయంతో ముందుకు సాగడం లేదు. ఒకసారి జనార్దన్‌ను కలిశారు. ఆతర్వాత రెండు రోజులకే హైదరాబాద్ వెళ్లి మాజీ మంత్రి, వైసీపీ నేత బాలినేనితో భేటీ అయ్యారు. ఇటీవల ఢిల్లీలో వైసీపీ అధినేత జగన్ చేపట్టిన ధర్నాకు హాజరయ్యారు. దీంతో పార్టీ మారే ఆలోచనను మేయర్ విరమించుకున్నారన్న భావనకు టీడీపీ నాయకులు వచ్చారు. అయితే ఆమె.. టీడీపీలో చేరాలనుకుంటున్న కొందరు కార్పొరేటర్లతోపాటు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దామచర్లను మళ్లీ కలిశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జనార్దన్, సుజాత మధ్య మేయర్ పదవిపైనే చర్చ జరిగినట్లుగా తెలిసింది. పూర్తికాలం మేయర్‌గా కొనసాగాలన్న తన ఆలోచనను సుజాత వ్యక్తంచేసినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే జనార్దన్ మేయర్ పదవి విషయంలో సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయమే మాకు శిరోధార్యమని, మేము ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోబోమని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వద్దే చేరికల కార్యక్రమం పెడితే ముందుగానే తమ ఆలోచనను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్న అభిప్రాయాన్ని మేయర్‌తోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న కొందరు కార్పొరేటర్లు చెప్పినట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే జనార్దన్ స్పందిస్తూ.. పార్టీలో చేరాల్సిన, చేరిన కార్పొరేటర్లను సీఎం వద్దకు తీసుకెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని చెప్పారు. తాను హైదరాబాద్‌లో శుభకార్యానికి హాజరు కావాల్సి ఉందని, సోమవారం మళ్లీ కలుద్దామని చెప్పినట్లు తెలిసింది.



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న కార్పొరేటర్లు ప్రసాద్, వెంకటశేషయ్య

ఘనంగా ఆదివాసీ దినోత్సవం
ఒంగోలులో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి

మంత్రి స్వామి

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9 : గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పొన్నలూరు, కనిగిరిలో గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గురుకులాల పెండింగ్ పనులను పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. గిరిజనులలో అక్షరాస్యత పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మరింత ప్రయోజనం కల్పించేలా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టళ్లను గురుకులాలుగా మార్చిన చోట తలెత్తుతున్న పరిపాలనాపరమైన సమస్యల పరిష్కారానికి గిరిజన శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ రీజనల్ ఆఫీసు జిల్లాలో ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. శ్రీశైలం వెళ్లే మార్గాన్ని నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడంతోపాటు అర్హులైన గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేస్తామని మంత్రి స్వామి తెలిపారు. డీఎస్సీ రాసే ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతి, శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులందరికీ ఆధార్ కార్డులు ఉండేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు

ఈ సందర్భంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని, ఆయుష్ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ శిబిరాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం ఎర్రగొండపాలెం దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోని 383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. గిరిజన భవనానికి నాలుగు కూలింగ్ వాటర్ బబుల్స్‌ను గిరిజన నాయకులు ప్రసాద్ బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, సంక్షేమశాఖల అధికారులు లక్ష్మానాయక్, అర్జున్ నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు లక్ష్మయ్య, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, మాల్యాద్రి, సైదా నాయక్, మోగన్న, స్థానిక కార్పొరేటర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ నుంచి గిరిజన భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

రీకౌంటింగ్ కాదు.. చెకింగ్!

ఒంగోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని 12 పోలింగ్ కేంద్రాల్లో డమ్మీ బ్యాలెట్‌లతో చెకింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇది రీ కౌంటింగ్ కాదని ఆమె స్పష్టం చేశారు. డమ్మీ బ్యాలెట్‌ను ఈవీఎంలలో చూపించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఒంగోలులో శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. మొత్తం 12 పోలింగ్ కేంద్రాలపై అనుమానాలు ఉన్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఈనెల 19నుంచి 24వతేదీ వరకు రోజుకు రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత బెల్ కంపెనీ, ఎన్నికల కమిషన్ నుంచి ప్రతినిధులు వచ్చి ఈవీఎంలలో డమ్మీ బ్యాలెట్ పేపర్లను పెట్టి చెక్ చేసి చూపిస్తారని తెలిపారు.



స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

15న జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షలు చేసి శాఖల వారీ బాధ్యతలను అప్పగించారు. ఒంగోలులో నిర్వహించే జిల్లాస్థాయి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఇన్‌చార్జి మంత్రులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి రెండునెలలే కాగా ఇంకా ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరగలేదు. ఈనేపథ్యంలో ఆగస్టు 15న ఎవరు జెండా ఆవిష్కరించాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. స్వాంతంత్ర్య దినోత్సవాన్ని ఏటా ఘనంగానే నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటం, మంత్రి, కలెక్టర్, ఎస్పీలు కొత్తవారు కావడంతో మరింత భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మహనీయులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం శుక్రవారం ఒంగోలులోని మినీస్టేడియంలో యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్ మాట్లాడుతూ 75 ఏళ్ళ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా ఆజాద్ కా అమృత్‌మహోత్సవ కార్యక్రమాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు యువజనులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ పువ్వాడ శ్రీరామన్నారాయణ, అధికారులు నారాయణ, రవితేజ, డి.జయ, బెన్‌హర్, కమల్‌షా, జీవీఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో విద్యార్థులకు వైద్యసేవలు

కొత్తపట్నం(ఒంగోలునగరం), ఆగస్టు 9: కొత్తపట్నంలోని ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు చెందిన వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో రమేష్‌బాబు మాట్లాడుతూ భవిత కేంద్రంలో దివ్యాంగులకు విద్యను అందించటంతో పాటు అనేక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వారికి ఈ కేంద్రంలో ఫిజియోథెరపీ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. సహారి సంస్థ ప్రతినిధులు రూ.15 వేల విలువైన జిమ్ సైకిల్‌ను ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పద్మావతి, వైద్యులు వి.అశోక్‌కుమార్, ఎస్‌కే.జిలానీ, సుధాకర్, హెచ్ఎం అనిల, వెంకటేశ్వర్లు, ఉషారాణి, వెంకటరెడ్డి, రవి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ అభినందనీయం

మద్దిపాడు, ఆగస్టు 9: పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని డాక్టర్ సింగు విజయరాఘవరావు పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడులో మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానానికి ఆయన ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏలూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

హాజరైన సింగరాయకొండ సర్పంచ్, అధికారులు ● రెండు రోజుల్లో నివేదిక అందజేస్తానన్న ఎస్‌డీసీ



అధికారులను విచారిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్

సింగరాయకొండ, ఆగస్టు 9 : సింగరాయకొండ మేజర్ పంచాయతీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై శుక్రవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విచారణాధికారి అయిన విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయీస్ డిప్యూటీ కలెక్టర్ కుమార్ ఆ ఉదంతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శుక్రవారం సింగరాయకొండ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, తదనంతరం జరిగిన పరిణామాలలో చోటుచేసుకున్న లొసుగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. పంచాయతీ సాధారణ నిధులు రూ.13 లక్షలు, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.33 లక్షలను సర్పంచ్ తాటిపర్తి వనజ దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. నిధుల దుర్వినియోగంపై గతంలో విచారణ చేపట్టిన ఒంగోలు డీఎల్పీవో పద్మ, కనిగిరి డీఎల్పీవో శోభన్‌బాబు అప్పటి పంచాయతీ కార్యదర్శి, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలకు సిఫార్సు చేసి అందులో ప్రధాన సూత్రధారైన సర్పంచ్ వనజపై ఎటువంటి చర్యలకు సిఫార్సు చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆ మేరకు గత విచారణాధికారులు డీఎల్పీవోలు పద్మ, శోభన్‌బాబుతోపాటు గత పంచాయతీ కార్యదర్శులు మోహన్‌రావు, శరత్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, సర్పంచ్ వనజ, ఈవోఆర్డీ అంజలీదేవి, పంచాయతీరాజ్ ఏఈ కోటా శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్‌లను విచారించి వాంగ్మూలాన్ని తీసుకున్నట్లు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కుమార్ చెప్పారు. గతంలో చేసిన చెల్లింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, నిధులు ఏ పనికి చెల్లించారు, ఆ పని జరిగింది లేదా.. సంబంధించిన వారికి చెల్లింపులు చేశారా, లేదా.. చెల్లింపులు చేసిన వారికి జీఎస్టీ ఉందా, లేదా అన్నీ విషయాలను విచారణ చేస్తామని వెల్లడించారు. రికార్డులను కూడా పూర్తి స్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 9 : జిల్లాలో 2047 నాటికి అన్ని రంగాల్లో జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ అభివృద్ధిలో మహిళలను కూడా భాగస్వాములు కావడం అత్యంత కీలకమన్నారు. ఈ దిశగా బ్యాంకు రుణాలు ఇచ్చి స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చేందుకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలు, బ్యాంకుల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 9500 ఎస్‌హెచ్‌జీ మహిళలతో ఈ ఆర్థికసంవత్సరం రూ.133 కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించేలా చేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి మహిళ లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా వారికి రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. పేదరికం లేని ప్రకాశం జిల్లా అవిష్కృతం కావడానికి బ్యాంకర్లు కూడా తమవంతు పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, ఎల్‌డీఎంలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, రమణ, శ్రీనివాసరావు, గోపీచంద్, చంద్రశేఖర్‌రెడ్డి, బేబీరాణి, జి.శ్రీనివాస్, ఎల్‌డీఎం రమేష్, నాబార్డు డీడీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి

బాలసదన్, శిశుగృహంలోని ఆరేళ్లలోపు పిల్లలను త్వరగా దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లీగల్ దత్తత రికార్డులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బాలసదనంలోని పిల్లలు స్కూలుకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని, ఎవరూ కూడా హోమ్‌లో ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నిలీమ, వంశీలత, శివశంకర్, సుమన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, డీపీవో బాలప్రభాకర్, లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రివ్యూ పిటిషన్

మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు వెంకట్రావు



మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. ఒంగోలులోని అంబేద్కర్ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో సివిల్ అప్పీల్‌లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు జస్టీస్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన వర్గీకరణ తీర్పును ఆర్టికల్ 137 ప్రకారం రివ్యూ కోరటం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీకులాల రిజర్వేషన్లు వర్గీకరణ చేస్తూ 1997లో అప్పటి ప్రభుత్వం చట్టం తెచ్చిందన్నారు. దీనిని సవాల్ చేస్తూ మాల మహాసభతో పాటు మరికొన్ని సంఘాలు ఉమ్మడి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ లిబర్‌హాన్ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహాసభ ముందుండి పోరాడుతుందని చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, కొండమూరి ప్రకాష్, కురుగుంట్ల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలి

రైతు, వ్యవసాయ, కార్మికసంఘాల డిమాండ్



ఒంగోలులో నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: దేశంలోని వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పెంట్యాల హనుమంతరావు, వీవీఆర్.చౌదరి, జీవీ.కొండారెడ్డి, ఎస్.లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్‌శక్తులకు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రత్యక్ష పనులను దేశంలో 30శాతం నుంచి 20శాతానికి తగ్గించడం దుర్మార్గంగా ఉందన్నారు. దీంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, పద్మ, ఎంఎస్.సాయి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ శ్రీనివాసరావు, ఆర్.వెంకట్రావు, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రతి రైతూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు కనపర్తి సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగంలో చేపట్టడం సరైన విధానం కాదన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జె.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ సీసీకేసీ కార్డులు మంజూరు చేయాలని, ప్రతి రైతుకు రూ.2లక్షల రుణం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, పర్వతరెడ్డి శ్రీనివాసరావు, అప్పల హనుమంతరావు, ఈమని సుబ్బారావు, బెజవాడ సంజీవరావు, కృష్ణారెడ్డి, ఉబ్బా వెంకటేశ్వర్లు, యు.ఆదిలక్ష్మి, షేక్ ఖాసిం, కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాల్లో ఆహ్వానిస్తున్న కార్పొరేట్ కంపెనీలను తరిమికొట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు అన్నారు. నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జె.జయంతిబాబు, కౌలు రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి తూబాటి శ్రీకాంత్, బసవపున్నయ్య, చుండూరి శ్రీరామూర్తి, ఎస్.రామారావు, స్వర్ణ కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాబు

పేదలకు అన్నదానం హర్షణీయం



అన్నం వడ్డిస్తున్న యోగయ్యయాదవ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9 : జనసేన అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో ఒంగోలులోని పేదలకు నిరంతరం అన్నదానం చేసేందుకు డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్య యాదవ్ పేర్కొన్నారు. స్థానిక లాయర్‌పేటలోని సీతమ్మక్యాంటీన్ వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలకు నిరంతరాయంగా అన్నదానం చేస్తున్న జనసేన పార్టీ నాయకుడు జడ బాల నాగేంద్రయాదవ్‌ను అభినందించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగయ్యయాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు ఉద్యమించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎల్ఐసీని దెబ్బతీసేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీఏఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రం, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసీ అత్యంత ముఖ్యమైన బ్రాండ్‌లలో మూడవ స్థానంలో ఉందన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసాను, సామాజికభద్రతను అందించడమేకాకుండా దేశానికి ఉపయోగపడే అనేక ప్రాజక్టులకు ఆర్థిక సహకారాన్ని ఎల్ఐసీ అందిస్తుందని చెప్పారు. అటువంటి సంస్థను మోదీ ప్రభుత్వం నిర్వీర్యంచేస్తుందని, దీనిని అడ్డుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బీవీ.రమణయ్య, కె.రమణారెడ్డి, డి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నాగ ప్రతిష్ఠతో సకల దోషాలు హరణం



పూజలు చేస్తున్న భక్తులు

జరుగువల్లి (కొండపి), ఆగస్టు 9 : నాగ ప్రతిష్ఠతో సకల దోషాలు తొలుగుతాయని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకుడు, జ్యోతిష్య పండితుడు డాక్టర్ ఘంటసాల సురేష్ శర్మ చెప్పారు. నాగులపంచమి సందర్భంగా మండలంలోని తూమాడు గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలతోపాటు పలు రకాల దోషాల నివారణకు జంట నాగుల ప్రతిష్ఠ, హోమ, జప, మంత్ర, తంత్ర, యంత్ర, మణి పరిహార కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

పీడీసీసీబీ నికర లాభం రూ.1.47కోట్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 9 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పీడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.47 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఒంగోలులోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మహాజనసభలో గత ఆర్థిక సంవత్సరంపు ఆడిట్ నివేదికను ఆమోదించారు. బ్యాంకు అధికారి పీఐసీ జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధ్యక్షతన మహాసభ జరిగింది. ఆడిట్ నివేదిక ప్రకారం బ్యాంకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.11 కోట్ల లాభాలు ఆర్జించింది. అయితే ఈ మొత్తం నుంచి బ్యాంకు రిజర్వు నిధి, ఇన్వెస్టిమెంట్ ప్లక్చ్యుయేషన్, ట్యాక్స్ లయబిలిటి తదితరాలు పోను బ్యాంకుకు నికరంగా రూ.1.47 కోట్లు రాబడి వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి, సీఈవో కొండారెడ్డి, జిల్లాలోని సొసైటీల అధికారులు, చైర్మన్లు పాల్గొన్నారు.

ఒంగోలు ట్రాఫిక్ సీఐగా పాండురంగారావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 9: గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న వై.పాండురంగారావును ఒంగోలు ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఈమేరకు శుక్రవారం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎస్సీఎస్టీ సెల్ సీఐగా పనిచేస్తున్న ఎ.వెంకటరమణను తిరుపతి జిల్లా వెంకటగిరి సీఐగా బదిలీ చేశారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం : వీసీ

నాగులుప్పలపాడు, ఆగస్టు 9: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు సేవలు చిరస్మరణీయమని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. ప్రకాశంపంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలెం గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైజ్‌లో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు



ప్రసంగిస్తున్న వెంకటప్రదీప్

ఒంగోలు(విద్య), ఆగస్టు 9: ఒంగోలులోని రైజ్‌కృష్ణ సాయిగ్రూపు విద్యాసంస్థల్లో శుక్రవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మోటివేషనర్ వెంకటప్రదీప్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలు వివరించారు. తల్లిదండ్రులు తమ ఆలోచనను పంచుకుంటూ జీవితాన్ని ఎలా గడపాలో తెలిపారు. విద్యార్థుల సందేహాలకు నివృత్తి చేశారు. వెల్‌నెస్ కోచ్ శివరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో మార్పుని కోరుకుని మంచివైపు పయనించి ఉన్నతశిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, రాగ చీఫ్ ఆర్గనైజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, ప్రిన్సిపాల్స్ కేవీ.సుబ్రహ్మణ్యం, జేవీ.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



దాణా అందిస్తున్న ఏడీఏ నాగభూషణరావు

నాగులుప్పలపాడు, ఆగస్టు 9 : పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నాగులుప్పలపాడు పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ నాగభూషణరావు సూచించారు. మాచవరం గ్రామంలో పశుసంవర్థక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పశువుల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన గడ్డి విత్తనాలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 63 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఎద ఇంజక్షన్‌లు, వ్యాక్సీన్‌లు అందించినట్లు రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. పశుపోషకులకు మినరల్ మిశ్రమాన్ని అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేఖ, సహాయకులు ఉషశ్రీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సంతనూతలపాడు, ఆగస్టు 9: సంతనూతలపాడు తహసీల్దార్‌గా వేమూరి ఆదిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలో రాష్ట్ర సచివాలయంలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై సంతనూతలపాడు తహసీల్దార్‌గా విచ్చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌కు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పి.తక్కెళ్లపాడు సచివాలయం సందర్శించారు. అనంతరం అదేగ్రామంలో శ్రీలక్ష్మిదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ సిబ్బందితో జరిగిన సమీక్షలో కౌలురైతుల కార్డులు, ఈ-పంట నమోదు ప్రకియపై చర్చించారు. మండలంలో 1169 కౌలు రైతు కార్డులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించగా, ఇప్పటివరకు 404 కార్డులు ఇచ్చినట్లు ఏవో పావని తెలిపారు. ఈ-పంట నమోదు ఈ ఏడాది సెప్టెంబరు 15వరకు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్యాంబాబు

చీమకుర్తి, ఆగస్టు 9: విద్యార్థి దశనుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్యాంబాబు తెలిపారు. మండలంలోని దేవరపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, నైతికవిలువలతో కూడిన విద్యనభ్యసించటం ద్వారా విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. న్యాయసేవాధికారిసంస్థ అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ సుబ్బారావు, ఎంపీడీవో రాఘవేంద్ర, ఎంఈవో శివాజీ, హెచ్ఎం భాస్కరశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

నాగులుప్పలపాడు, ఆగస్టు 9: మండలంలోని నాగులుప్పలపాడు, ఈదుమూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలు శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదుమూడిలో ఉదయం 11 గంటలకు, నాగులుప్పలపాడులో సాయంత్రం 5 గంటలకు జరగనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పేస్‌లో ఆధార్, పాన్‌కార్డుల సేవలు



ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది

ఒంగోలు(విద్య), ఆగస్టు 9: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధార్ కార్డు, పాన్‌కార్డుల్లో తప్పుల సవరణకు ఆధార్ బృందం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్ ప్రత్యేక బృందం కళాశాలకు వచ్చి విద్యార్థుల ఆధార్ కార్డులు, పాన్‌కార్డుల్లోని తప్పులను సవరించారు. కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది కూడా ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకున్నారు ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, ఎం.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

13న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, ఆగస్టు 9: ఒంగోలులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి టి.భరద్వాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ మేళా జరుగుతుందన్నారు. తారికా మేనేజ్‌మెంటు సర్వీసెస్, ఎయిర్‌టెల్ పేమెంటు బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు టైమ్స్‌ప్రో, ఫ్లిప్‌కార్టు, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లమా, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్వ్యూలకు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జెరాక్స్‌కాపీలతో హాజరుకావాలని సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 9 : ఒంగోలులోని శర్మాకాలేజీలో 1975-78 విద్యా సంవత్సరంలో బీఏ చదివిన విద్యార్థులంతా స్థానిక కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు ముప్పై మంది పూర్వ విద్యార్థిలు పాల్గొని సంతోషాలు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మాజీ ఏపీ పోలీస్ అకాడమీ డైరెక్టర్ రాజ శిఖామణి మాట్లాడుతూ త్వరలో కాలేజీలోని అన్ని విభాగాల వారందరూ ఒకేచోట కలిసే విధంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శర్మాకాలేజీలో చదివిని సినీ నటులు చిరంజీవి, రచయిత మరుధూరి రాజా, సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, వంటి మరెందరో పూర్వ విద్యార్థులు, ప్రముఖులను ఆహ్వానించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జ్వాలాపతి, సూరి, నాగేశ్వరరావు, మోహన్‌రావు, ప్రసాద్ పలువురు పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన లెక్చరర్లు అయ్యంగారు, చిరంజీవి, సాల్మన్, శాస్త్రి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో కల్పన

పొన్నలూరు (కొండపి), ఆగస్టు 9 : అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నిల్వలు లేకుండా చూడాలని, అదేవిధంగా తడి, పొడిచెత్తలను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో కల్పన చెప్పారు. శుక్రవారం పొన్నలూరులో క్లాప్ మిత్రలకు జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెత్తను సేకరించే క్లాప్ మిత్రలు చెత్తను వేరు చేయాలని, తిరిగి దాని నుంచి సంపద తయారు చేయాలని సూచించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

మహిళ వద్ద 10 సవర్ల బంగారం అపహరణ

ఇరానీగ్యాంగ్ పనిగా అనుమానం

జిల్లావ్యాప్తంగా పోలీసుల అప్రమత్తం

ఒంగోలులోనూ తనిఖీలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు9 : "దొంగలున్నారు జాగ్రత్త.. మేము పోలీసులం.. బంగారం అలా వేసుకొని వెళ్ళకూడదు." అని హెచ్చరించి ఓ మహిళ వద్ద బంగారపు ఆభరణాలను అపహరించుకెళ్లారు దుండగులు. ఈ సంఘటన టంగుటూరు మండలం నాయుడుపాలెం జాతీయ రహదారి పై శుక్రవారం జరిగింది. వివరాలలోకి వెళితే.. కొండపి మండలం చోడవరం గ్రామానికి చెందిన బాలినేని వెంకటరమణమ్మ అనే మహిళ నాయుడుపాలెంలోని తన పుట్టింటికి వచ్చి వెళుతుంది. గ్రామంలోని జాతీయరహదారి వద్ద ఆటో ఎక్కేందుకు వెళుతున్న వెంకటరమణమ్మను ఇరువురు వ్యక్తులు పిలిచి తాము పోలీసులమని చెప్పారు. దొంగలు ఎక్కువగా తిరుగుతున్నారని, అలా బంగారపు ఆభరణాలు ధరించి తిరగకూడదని హెచ్చరించారు. అంతేగాకుండా ఆమె వద్ద ఉన్న పది సవర్ల బంగారం తీయించి ప్యాకెట్ కట్టించి ఇస్తామని చెప్పి వారు తీసుకున్నారు. ఆమెకు మాత్రం ఓ ప్యాకెట్‌ను ఇచ్చి జాగ్రత్తగా సంచీలో పెట్టుకోమని సలహా ఇచ్చారు. దీంతో వెంకటరమణమ్మ చోడవరం వెళ్ళిన తరవాత ప్యాకెట్ విప్పి చూడగా అందులో రాళ్ళు ఉన్నాయి. బంగారం బదులు రాళ్ళు ఉండటం చూసి గొల్లుమని ఆమె ఏడ్చింది. పది సవర్ల బంగారం ఆభరణాలు అపహరణకు గురైనట్లు టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం ముగ్గురు వ్యక్తులు ఉన్నాట్లు బాధితురాలు తెలిపింది.

అప్రమత్తమైన పోలీసులు

నాయుడుపాలెం జాతీయరహదారి వద్ద మహిళను మోసం చేసి పది సవర్ల బంగారం అహరించుకెళ్ళినట్లు గుర్తించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఈ తరహ నేరాలు చేసేది ఇరానీ గ్యాంగ్‌గా గుర్తించి జిల్లాలో అన్ని ప్రాంతాలను అప్రమత్తం చేశారు. ఒంగోలులోనూ తనిఖీలు నిర్వహించారు.

గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వానికి గృహ నిర్మాణాలు ప్రాధాన్యత అంశమని, అందువల్ల ఇళ్ళ నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం సాయంత్రం హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, జడ్పీ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గృహనిర్మాణానికి అవసరమైన ఇసుకతో పాటు ఇతర మెటీరియల్, ఆర్థికపరమైన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు లే అవుట్లకు స్పెషల్ ఆఫీసర్లుగా ఉండి ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతివారం జిల్లా స్థాయిలో సమీక్షించడం జరుగుతుందని, ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పేరయ్య, మర్దన్‌అలీ, వసుంధర, రవికుమార్, వందన్‌మాన్, హనుమంతరావు, శ్రీనివాసప్రసాద్, దశరథశర్మ తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ ఉద్యోగులకు వేతనం ఖరారు

ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్/ రోజువారీ ఉద్యోగులు(డైలీవేజ్) ఉద్యోగులకు రోజువారీ వేతనాన్ని ఆమోదించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షత వహించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, మునిసిపల్ కమిషనర్లు, ఎడ్యుకేషన్, మెడికల్‌తో పాటు సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పెంచిన వేతనాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్‌స్కిల్డ్‌కు రూ.667, సెమీస్కిల్డ్‌కు రూ.760, స్కిల్డ్‌కు రూ.864, హైస్కిల్డ్‌కు రూ.1001 వేతనాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో ఉపకార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కారుమంచి డొంక మరమ్మతులకు శ్రీకారం

టంగుటూరు, ఆగస్టు 9 : ఎం.నిడమలూరు నుంచి కారుమంచి పోవు మార్గంలో డొంక మరమ్మతులను టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. మంత్రి స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపు మేరకు కారుమంచి డొంక పనులు ప్రారంభించినట్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకుమాను శ్రీకాంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల స్వామి, గ్రామపార్టీ సీనియర్ నాయకులు చిడిపోతు కోటయ్య, కాకుమాని రమణయ్య, బెజవాడ శివయ్య, ఐటీడీపీ మండల ప్రతినిధి కాకుమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు కూటమి నాయకుల శుభాకాంక్షలు



సృజన్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

మద్దిపాడు, ఆగస్టు 9: మద్దిపాడు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సృజన్‌కుమార్‌ను శుక్ర వారం నందిపాడు టీడీపీ నాయకులు కోదూరి లక్ష్మీనారాయణ, బోడంపూడి వెంకటసత్యనారాయణ, మారెళ్ల సురేంద్రబాబు, మన్నే శేషయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నందిపాడు రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అలాగే జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆరే వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, వీర మహిళ విభాగ అధ్యక్షురాలు హరిత, మాదాసు మహేష్, నూనె శ్రీనివాసరావు, దండే రామారావు, పొన్నం అయ్యప్ప పాల్గొన్నారు. ఇక మండల వీఆర్ఏలు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో కె.రాఘవులు, వై.శ్రీరాములు, కె.కోటయ్య, యు.సావిత్రి, పి.అపర్ణ పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాల నిర్వహణపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సహకార శాఖమంత్రి అమీత్‌షా సమాధానం ఇస్తూ దేశంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు గ్రామీణ వ్యవసాయం బాగా వృద్ధిచెందడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. జిల్లా, రాష్ట్ర సహకార బ్యాంకులు, నాబార్డు సహకారంతో రుణసౌకర్యతో పాటు విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోలు, గిడ్డంగి వసతులను కల్పిస్తామన్నారు. సంఘాల ఆర్థిక పరిపుష్టికి మరో 25 ఆర్థిక కలాపాలు నిర్వహించేందుకు కేంద్రం ఉపచట్టాలను రూపొందించిందని చెప్పారు.

ఘనంగా ఎల్లో డే



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 9: ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూలులో శుక్రవారం ఎల్లోడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను పసుపు రంగు బెలూన్లతో సుందరంగా అలకరించారు. నర్సరీ విద్యార్థులకు పసుపు రంగును పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అలెక్స్ తెలిపారు. నర్సరీ విద్యార్థులందరూ పసుపు రంగు దుస్తుల్లో స్కూలుకు వచ్చారు. వివిధ వస్తువులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 మందికి ప్రవేశాలు

నూజివీడు టౌన్, ఆగస్టు 9: ఆర్‌జీయుకేటీ పరిధిలో రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు సంబంధించి 238 మందికి కాల్ లెటర్స్ పంపగా 134 మంది ప్రవేశాలు పొందారు. అదేవిధంగా ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 518 మందిని పిలువగా 310మంది ప్రవేశాలు పొందినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు.

11న అథ్లెటిక్స్ పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 9: మార్కాపురంలోని బాయ్స్ హైస్కూల్ ఆవరణంలో ఈ నెల 11న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అడహక్ కమిటీ తెలిపింది. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 7675026220, 8074992796 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొంది.

ఆలయ భూములకు ఎసరు?

అక్రమంగా పట్టాల పంపిణీ ● నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల తీరు

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్



పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయం

వరికుంటపాడు, ఆగస్టు 9: సామాన్యులకు సెంటు భూమి కేటాయించేందుకు సవాలక్ష నిబంధనలను సాకుగా చూపే రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఏకంగా ఆలయ భూములకే ఎసరు పెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లతో పకడ్బందీగా రికార్డులను రూపొందించి అక్రమంగా పట్టాలు అందచేశారు. దీన్ని బట్టి చూస్తే మండల అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారి పనితీరుకు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామ రెవెన్యూలో జరిగిన భూబాగోతమే నిదర్శం. వివరాల్లోకి వెళితే..

ఫిర్యాదులో వెలుగులోకి... ప్రకాశం జిల్లా పామూరులోని మదన వేణుగోపాల స్వామి ఆలయానికి వేంపాడు గ్రామంలో భూములు ఉన్నాయి. పామూరుకు చెందిన కొందరు వ్యక్తులు వాటిపై కన్నేశారు. స్థానికుల సహకారంతో రెవెన్యూ అధికారులను లోబర్చుకొని సర్వే నంబరు 78-1లోని 6.08 ఎకరాల భూమిని 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆలయ కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు అమ్మినట్లుగా బినామీ రికార్డులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేకాక దేవదాయశాఖ అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహాకరించడం లేదని పట్టాలు పొందిన వ్యక్తులు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది సెప్టెంబరు 2న నోటీసులు అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు, 1948 నుంచి ఆలయానికి సంబంధించిన పూర్తి రికార్డులను ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం జేసీ కోర్టులో సాగిన విచారణలో ఆ భూమిలో పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లను తొలగించి యథావిధిగా ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబరు 26న తీర్పు ఇచ్చారు. దీంతో ఆలయ ఈవోతోపాటు కమిటీ సభ్యులు తమకు న్యాయం జరిగిందని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. అప్పటి నుంచి ఆలయ కమిటీ సభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి గతంలో రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని, ఆక్రమిత భూములను ఆలయ ఆస్తిగా రికార్డులో నమోదు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

బాధితులంతా జిల్లా వాసులు

మనుబోలు, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నెల్లూరు జిల్లా మనుబోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరు సత్రం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు, ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం కుంట గ్రామానికి చెందిన పుష్పాల ఆవులయ్య (52) గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు ఒరుసు కిరణ్ వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం కోసం డ్రైవర్ ఒరుసు వెంకటేష్‌తో కలిసి ఇద్దరూ కారులో చెన్నైకి వెళ్ళారు. అక్కడ వైద్యం చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కొండూరు సత్రం దాటాక ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆవులయ్య మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

కనిగిరి, ఆగస్టు 9: గడ్డికోసుకుంటున్న మహిళపై కొడవలితో దాడిచేసి గాయపరచిన ఘటన శుక్రవారం ఏరువారిపల్లి గ్రామ పొలాల్లో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పాశం శ్రీలక్ష్మి తన పొలంలో గడ్డి కోసుకుంటుంది. అదే గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి ఆమె వద్దకు వచ్చి ఈ పొలం తమదని, గడ్డి కోయవద్దంటూ గొడవకు దిగాడు. అంతేగాకుండా శ్రీలక్ష్మి చేతిలో ఉన్న కొడవలి తీసుకుని దాడి చేశాడు. దీంతో ఆమె తన చేతిని అడ్డుపెట్టడంతో గాయపడి రక్తస్రావమై పొలంలోనే అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. సమాచారం అందుకున్న బాధిత మహిళ బంధువులు 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలించేందుకు వస్తున్న అంబులెన్స్‌కు దాడికి పాల్పడిన తిరుపాల్‌రెడ్డి తన ట్రాక్టర్‌ను అడ్డుగాపెట్టాడు. దీంతో చేసేదిలేక అంబులెన్స్ సిబ్బంది పొలం వద్దకు వెళ్ళి బంధువుల సాయంతో ఆమెను కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

కనిగిరి, ఆగస్టు 9: లారీ ఢీకొన్న ఘటనలో మోటార్‌సైక్లిస్టు మృతి చెందిన సంఘటన శుక్రవారం కనిగిరిలో జరిగింది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. కనిగిరి సమీపంలోని కొత్తూరులో నివాసం ఉంటున్న కర్నాటి వీరారెడ్డి (45) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. కనిగిరిలో పనులు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా వాహనం ఆగిపోయింది. దీంతో వాహనం స్టార్ట్ చేస్తున్నక్రమంలో వింజమూరు వెళుతున్న లారీ ఇనుపకమ్మీ వీరారెడ్డి చొక్కాను తగులుకుని ఈడ్చుకెళ్ళటంతో వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలికి వచ్చి గుండెలవిసేలా రోదించిన తీరు చూపురులను కలచివేసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వీరారెడ్డి మృతితో కొత్తూరులో విషాదచాయలు అలుముకున్నాయి. సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా నడికుడి రైల్వేలైన్ పనులు

● త్వరలో నెరవేరనున్న పొదిలి ప్రాంత వాసుల కల
● కీలక అండర్‌పాస్ నిర్మాణాలు పూర్తి


రాజుపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వేస్టేషన్

పొదిలి, ఆగస్టు 9 : పొదిలి ప్రాంతవాసులు ఎదురు చూస్తున్న నడికుడి కాళహస్తి రైల్వే నిర్మాణ పనులు పొదిలి ప్రాంతంలో శరవేగంగా జరుగుతున్నాయి. దర్శి, పొదిలి, కనిగిరి మీదుగా జరిగే ప్రాజెక్ట్ పనులకు సంబంధించి వంతెన, రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. దర్శి నుంచి కనిగిరి వరకు మూడోదశ పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మండలంలోని దాసర్లపల్లి, బుచ్చనపాలెం, కాటూరివారిపాలెం, రాజుపాలెం మీదుగా సాగుతున్న పనులు ప్రస్తుతం కట్టపై కంకర, పట్టాల నిర్మాణం పూర్తి అయింది. మరోవైపు రాజుపాలెం గ్రామం సమీపంలో స్టేషన్ నిర్మాణం కొనసాగుతోంది. ప్రధాన రహదారి కాటూరివారిపాలెం పొదిలి మధ్యలో ఇప్పటికే అండర్‌పాస్ వంతెన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. అయితే రాజుపాలెం సమీపంలో కొంతభాగం పరిహారం తక్కువగా ఇస్తున్నారని ప్రైవేటు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిసింది. రైల్వే అధికారులు ఆ ప్రదేశాన్ని వదిలేసి అటు ఇటూ మిగిలిన ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. స్టేషన్‌కు సంబంధించి అన్ని రకాల ప్లాట్‌ఫాంలు, భవనాల నిర్మాణం కొనసాగుతోంది. మరో రెండేళ్లలో ఈ ప్రాంత వాసుల కల నెరవేరనుందని, మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దర్శి వరకు అధికారులు రైలులో ప్రయాణం చేసిన విషయం తెలిసిందే.



కాటూరివారిపాలెం వద్ద పూర్తయిన అండర్‌పాస్, పొదిలివద్ద రైలు కట్టపై ఏర్పాటు చేసిన పట్టాలు

అవీ..ఇవీ..

సెంట్రల్ జోన్ పోటీలకు దోర్నాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పెద్ద దోర్నాల, ఆగస్టు 9: సెంట్రల్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు దోర్నాల విద్యార్థి నులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా ఈ నెల 7న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రీజనల్ స్థాయి పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పీ శివలక్ష్మీ, ఎస్ ధావన్య, ఎం.స్వాతి, కే.కౌసల్య, డీ.స్వాతిలు ప్రతిభ కనబర్చి సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఈవెంట్స్ అండర్-16 విభాగంలో బాలికల కేటగిరిలో 100 మీటర్ల పరుగుపందెంలో ఎం.స్వాతి, కౌసల్య ప్రథమ, ద్వితీయ స్థానంలో గెలుపొందారు. 200మీటర్ల పరుగు పందెంలో శివలక్ష్మీ ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో డీ స్వాతి ద్వితీయంలోనూ విజయం సాధించారు. ఈ నెల చివరి వారంలో అనంతరపురం లో నిర్వహించే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని, అక్కడ కూడా రాణించాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు. బాలికలకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామా నాయక్, రామానాయక్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, విజయమాణిక్యం, మీటేనాయక్, అనసూయాదేవి, చంద్రమౌళి పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ

కంభం, ఆగస్టు 9 : కంభం మండల పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు గ్రామపంచాయతీలోని విధులు, బాధ్యతలపై 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశం హాలులో 3 రోజులు ఉదయం గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి


వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

గిద్దలూరు, ఆగస్టు 9 : ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని తహసీల్దార్ అంజనేయరెడ్డి కోరారు. ఆయన తన కార్యాలయంలో వీఆర్‌వోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ వద్దకు వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చౌకడిపో డీలర్లతో తహసీల్దార్ సమావేశమయ్యారు. బియ్యం, ఇతరత్రా వస్తువులను రేషన్‌కార్డుదారులకు అందించే విషయంలో అజాగ్రత్త వహించవద్దని సూచిం చారు. తక్కువ తూకం ఇచ్చినా ఎక్కువ ధరలు వసూలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, ఆగస్టు 9 : ప్రజాస్వామ్య పరిరక్షణలో భారత రాజ్యాంగం అనే అంశంపై ఈ నెల 10న శనివారం ఉదయం 11గంటలకు సాహితి జూనియర్ కళాశాల ఆవరణలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పిడతల రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొనవచ్చని, విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

దివ్యాంగునికి ట్రై సైకిల్ పంపిణీ


ట్రై సైకిల్ అందజేస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 9 : మండలంలోని వెల్లుపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి పాండురంగారెడ్డి అనే దివ్యాంగునికి అమ్మ ఫౌండేషన్ సేవా సంస్థ ట్రై సైకిల్ అందజేసింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ ఆవరణంలో ఈ నెల 11న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అడక్ కమిటీ ప్రెసిడెంట్ పి.రామచంద్రరావు, సెక్రటరీ మారుబోయిన వెంకట్‌రెడ్డిలు తెలిపారు. ఈ పోటీలకు 01-10-2021 నుంచి 30-09-2008 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు రాజునాయక్ 7675026220, గోపీచంద్‌రెడ్డి 8074992796 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వెర్రితెగులు నివారణకు సూచనలు


రైతులకు సూచనలిస్తున్న ఏవో స్వరూప

కంభం, ఆగస్టు 9 : కందిపంటను ఆశిస్తున్న వెర్రితెగులు నివారణకు మండల ఏవో స్వరూప రైతులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం మండలంలోని యర్రబాలెం, లింగాపురం గ్రామాలలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ తెగులు సోకినప్పుడు మొక్క లేత ఆకుపచ్చ రంగులోకి మారడమేకాక పూత పూయదన్నారు. యూరియాఫిట్ నల్లిని నివారించుకోవడం ద్వారా దీన్ని వ్యాప్తి చెందకుండా ఆపవచ్చన్నారు. అలాగే తెగులు సోకకుండా మొక్క నెల రోజుల్లోపు పైరుపై వేపగింజల కాషాయాన్ని పిచికారి చేసుకోవాలన్నారు.

ఈ-పంట నమోదు తప్పని సరి : ఏవో నీరజ

త్రిపురాంతకం, ఆగస్టు 9: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.నీరజ తెలిపారు. మండలంలోని మేడపిలో పంటనమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంటను ఈనెల 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు వలన రైతులకు ప్రభుత్వం నుంచి అందే ప్రతి పథకానికీ అర్హత పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో మేడపి రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్ద దోర్నాల, ఆగస్టు 9:పత్తి పైరులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని జమ్మిదోర్నాల, లో ఆహారం- పౌష్టికాహారభద్రత, పత్తిసాగుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకుగానూ ఎకరానికి 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేపగింజల కషాయంతో నూనె తయారు చేసుకుని పంటపై పిచికారి చేయాలన్నారు. సాగు చేసిన పంటను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న రేషన్‌డీలర్లు

కంభం, ఆగస్టు 9 : కంభం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండలంలోని డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీలర్ల సంఘం అధ్యక్షులు అన్నా శ్రీను మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్లను పక్కనపెట్టి రేషన్ బియ్యాన్ని ఇంటింటి సరఫరాకు సంచారవాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ వాహనాలతో ప్రభుత్వానికి అదనపు భారం పడిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టీడీపీ ప్రభుత్వం సంచార వాహనాలకు స్వస్తిచెప్పి తిరిగి డీలర్లకే అప్పగించే నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతగా చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు చలువాది నారాయణ, కార్యదర్శి ప్రహ్లాద, ట్రెజరర్ దేవకి రంగయ్య, అనీస్, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళ పర్సు కొట్టేసిన దుండగులు

● పొదిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘటన

పొదిలి, ఆగస్టు 9 : పొదిలి ఆర్టీసీ బస్టాండ్ వరస దొంగతనాలకు నెలవుగా మారుతోంది. ప్రయాణీకులు సెల్‌ఫోన్‌లు, నగదు పోగొట్టుకోవడం ఇక్కడ నిత్యకృత్యంగా మారుతోంది. ఇదేక్రమంలో శుక్రవారం దర్శి నుంచి కనిగిరికి వెళుతున్న రమణమ్మ అనే మహిళ బస్టాండ్‌లో కనిగిరి బస్సుకోసం వేచి చూస్తోంది. ఆ సమయంలో పర్సుతో ఉన్న కర్రల సంచిని పక్కనబెట్టి ఎదురు చూస్తోంది. ఈ క్రమంలోనే ఆమె కర్రల సంచిలో ఉన్న పర్సును గుర్తుతెలియని దుండగులు తీసుకెళ్లారని బాధితురాలు వాపోయారు. పర్సులో పదివేల రూపాయల నగదు ఉన్నట్లు ఆమె తెలిపారు. అయితే విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏమి చేయలేమని సమాధానం చెప్పినట్లు వాపోయారు. అధికారుల ఉదాసీనతో పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో జేబుదొంగలు హల్‌చల్ చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెలు పనిచేసేలా చూసి పోలీసుల నిఘా ప్రయాణీకులు కోరుతున్నారు.

వ్యవసాయరంగంలో కార్పొరేట్లను బహిష్కరించాలి

రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు


వై.పాలెంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 9 : దేశ సంపదను లూటీచేస్తున్న కార్పొరేట్లను వ్యవసాయ రంగం నుంచి బహిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రగొండపాలెంలో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్ కంబంధ హస్తాల నుంచి కాపాడాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతూ కార్పొరేట్లకు దోచిపెడుతున్నారన్నారు. కార్పొరేట్ ట్యాక్స్ 30నుంచి 20 శాతం తగ్గించడం వలన ఏటా కేంద్ర ప్రభుత్వానికి రూ.1.45 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమానికి నియోజకవర్గ రైతుసంఘం అధ్యక్షులు బి .రామయ్య గౌరవాధ్యక్షులు టీసీ హెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ. కిష్టగౌడ్, బీసీ సంఘం అధ్యక్షులు యాపర్తి వీరయ్య, రైతు సంఘం సభ్యులు ఎం వెంకటేశ్వర్లు, బి లక్ష్మయ్య, జి.వెంకటేశ్వర్లు, ఎ .యోగయ్య పాల్గొని నిరసన తెలిపారు.

మార్కాపురం వన్‌టౌన్ : దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలను బహిష్కరించాలని కోరుతూ కిసాన్ మోర్చా, ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజలకు విశిష్టమైన సేవలు అందిస్తూ లక్షల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వేలు, ఎల్‌ఐసీ, హిందుస్తాన్ పెట్రోల్ కంపెనీ లిమిటెడ్, పౌర విమానయాన శాఖ, హిందూస్థాన్ పెట్రోలియం ఉత్పత్తుల శాఖ తదితర సంస్థలను నష్టాలబాట చూపుతూ కారుచౌకగా అంబానీ, ఆదానీలకు కట్టబెడుతోందన్నారు. వ్యవసాయం కోసం సామాన్య రైతు బ్యాంకులో రుణం తీసుకొని, ప్రతికూల పరిస్థితుల్లో సకాలంలో తీర్చలేకపోతే నానా హంగామా సృష్టించి భయభ్రాంతులకు గురిచేసే బ్యాంకు అధికారులు కార్పొరేట్లకు మాత్రం రుణాలు ఇచ్చి విదేశాలకు సాగనంపుతున్నారన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్లాడుతున్నారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గుమ్మ బాల నాగయ్య, డీకేఎం రఫీ, ఎస్‌కే కాశీం, వెంకటేశ్వర్లు, పీవీ కొండయ్య, వెంకటరెడ్డి, ఎల్లయ్య, సీపీఐ నాయకులు జి.కాశయ్య కేవీపీఎస్ నాయకులు జవ్వాజి రాజు పాల్గొన్నారు.

గిద్దలూరు, ఆగస్టు 9 : 'క్విట్ కార్పొరేట్ ఇన్ అగ్రికల్చర్ సెక్టార్' అంటూ సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు రైతుసంఘం ప్రతినిధులు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ రంగం ప్రవేశిస్తే సామాన్య రైతులకు నష్టం కలుగుతుందన్నారు. కేరళ తరహాలో రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేయాలని, సమగ్ర ప్రభుత్వరంగ పంటల బీమా సంస్థను ఏర్పాటు చేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ సార్వత్రికం చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని కఠినతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం కన్వీనర్ వి.రామక్రిష్ణ, సంఘ ప్రతినిధులు పూర్ణ, రామిరెడ్డి, చంద్రపాల్ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురంరూరల్, ఆగస్టు 9: మండలంలోని దరిమడుగు గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కలశపూజ, హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, సహిత శిఖర, నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామంలో మహిళలు, యువకులు, గ్రామపెద్దలు భారీ సంఖ్యలో ఆలయం వద్దకు చేరి కాయకర్పూరం సమర్పించి స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

నాగపంచమి వేడుకలు


నాగుల పుట్టలో పాలుపోసున్న భక్తులు

కంభం, ఆగస్టు 9 : కంభం మండలంలో శుక్రవారం నాగులపంచమి వేడుకలను మహిళ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకోటాసత్యమ్మ తల్లి ఆలయ సమీపంలోని నాగులపుట్ట, గండివీరాంజనేయస్వామి ఆలయ సమీపంలోని పుట్ట, రావిపాడు రహదారి పక్కన ఉన్న పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు
● నెల్లూరుజిల్లా మనుబోలు వద్ద ఘటన

మనుబోలు, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన నెల్లూరు జిల్లా మనుబోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరు సత్రం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు, అర్థవీడు మండలం కుంట గ్రామానికి చెందిన పుష్పాల ఆవులయ్య (52) గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు ఒరుసు కిరణ్ వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం కోసం డ్రైవర్ ఒరుసు వెంకటేష్‌తో కలిసి ఇద్దరూ కారులో చెన్నైకి వెళ్ళారు. అక్కడ వైద్యం చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కొండూరు సత్రం దాటాక ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆవులయ్య మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

మరోఘటనలో ముగ్గురికి గాయాలు

త్రిపురాంతకం, ఆగస్టు 9: మండలంలోని దూపాడు వద్ద ఎన్‌హెచ్ 544డిపై మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కుంట వైపు వెళుతున్న పాలవాహనాన్ని వెనుక వస్తున్న కారు ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కుంట నుండి గుంటూరు వెళ్ళే కూరగాయల వాహనాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో పాల వాహనాన్ని కూడా ఢీకొట్టింది. మూడూ ఒకదానికొకటి ఢీకొట్టుకోవడంతో కూరగాయల వాహనంలో ఉన్న విశ్వనాద్ తలకు, సాయి కి చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులోని విజయ్ కుమార్‌రెడ్డికి కాలు విరిగింది. కారులోని మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రమాద స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను త్రిపురాంతకం, వినుకొండ వైద్యశాలలకు తరలించారు.

ఆదివాసీల హక్కులపై అవగాహన

పెద్దదోర్నాల, ఆగస్టు 9:అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు తమ హక్కులు తెలుసుకుని అభివృద్ధి చెందాలని ఏఆర్‌హెచ్‌ఈడీఎస్ సంస్థ ప్రతినిధి కరుణాకర్ అన్నారు. మండలంలోని మొట్ల మల్లికార్జునపురంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కో-ఆర్డినేటర్ కరుణాకర్ మాట్లాడుతూ అనాదిగా అటవీ ప్రాంతంలో నివశిస్తున్న చెంచుగిరిజనులు మైదాన ప్రాంతాలవారికి సమానంగా ఎదగాలంటే చదువుకోవాలని తద్వారా హక్కులు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి బాట పట్టాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంగమ్మ, సంస్థ సభ్యులు ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటరమణ, దావీద్, సామ్యేల్ జాన్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

గిద్దలూరుటౌన్, ఆగస్టు 9: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితలపై సోషల్ మీడియాలో, ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టింగ్‌లు పెట్టడం శోచనీయమని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. పోస్టింగ్‌లు పెట్టిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలంటూ ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూదేకుల దస్తగిరి, టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు బొర్రా రామవేంద్రయాదవ్, టీడీపీ నాయకులు సాయి, షానేషా, షేక్ బద్రిబాషా, షేక్ మహబూబ్‌బాషా తదితరులు అర్బన్ సీఐ సోమయ్యకు ఫిర్యాదు చేశారు.

రెండురోజుల పాటు రైల్వే గేటు మూత

తర్లుపాడు, ఆగస్టు 9: తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలోని ప్రధాన రైల్వే గేటు 2 రోజులు మూతవేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 12, 13న రైల్వే గేటు, ట్రాక్ మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో పూర్తిగా గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ గేటు నుంచి 15 గ్రామాల ప్రజలు నిత్యం మార్కాపురం వెళ్తుంటారు. వేరే మార్గాలలో పోవాలంటే 25 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. తాడివారిపల్లె, నాగెళ్లముడుపు, మీర్జపేట నుంచి వెళ్లే ప్రయాణికులు 20కి.మీ అదనంగా ప్రయాణించాల్సి ఉంది. ఆర్టీసీ బస్సులు కూడా రద్దు కానున్నాయి. పాఠశాలలు, కళాశాలల బస్సులు రద్దుకానున్నటంతో విద్యార్థులు ఇబ్బందులు గురికాక తప్పదు. దీంతో రెండు రోజుల పాటు ప్రయాణికులకు కష్టాలు తప్పవు.

సరళను భర్త కుటుంబ సభ్యులే చంపేశారు..!

● మృతురాలి బంధువుల ఆరోపణ
● జాతీయ రహదారిపై ఆందోళన


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 9 : మండలంలోని గోళ్లవీడపి గ్రామంలో గురువారం మధ్యాహ్నం సంద్రపాటి సరళ (23) ఇంటిలో అనుమానస్పద స్థితిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. దీంతో సరళ తల్లిదండ్రులు బంధువులు శుక్రవారం ఎర్రగొండపాలెం వైద్యశాల వద్ద జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. సరళను భర్త దేవదాసు, అత్త, మామ, అడబిడ్డలు కొట్టిచంపారని ఆందోళన చేశారు. సరళది హత్య అని తల్లిదండ్రులు నీరూరి గజ్జెలయ్య, మరియమ్మ, ఆమె బంధువులు ఆరోపించారు. ధర్నా చేస్తున్న సరళ తల్లిదండ్రులు, బంధువుల వద్దకు డీఎస్పీ బాలసుందరరావు, సీఐ రాములు నాయక్ వచ్చి సరళ మృతిపై పూర్తి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. పోస్టుమార్టంలో పూర్తి వివ రాలు వెలుగులోని వస్తాయన్నారు. పోస్టు మార్టంలో వైద్యుల నివేదిక ప్రకారం కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తామన్నారు. దొనకొండ మండలం మంగినపూడి గ్రామం నుంచి 100 మందికిపైగా సరళ బంధువులు వచ్చి ధర్నా చేశారు. అయితే సరళ భర్త దేవదాస్, అత్తమామలు గోళ్లవీడపి గ్రామంలో నివాసం గృహం వదిలి వెళ్లారు.


వర్షాలకు ఏపుగా పెరిగిన జొన్నపైరు

వర్షాలకు కళకళలాడుతున్న పైర్లు

దర్శి, ఆగస్టు 9: దర్శి ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పైర్లు కళకళలాడుతున్నాయి. తొలుత వర్షాభావంతో పైర్లు వాడుముఖం పట్టాయి. గత వారం రోజులుగా రెండుసార్లు విస్తారంగా వర్షాలు కురవటంతో పైర్లు జీవం పోసుకున్నాయి. దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో జొన్న, కంది, పెసర, పత్తి తదితర పైర్లు సాగుచేస్తున్నారు. వర్షం పడక కొన్నిచోట్ల విత్తనం వేయలేదు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మిగిలిన భూముల్లో కూడా ముమ్మరంగా పైర్లు సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో కంది, పొగాకు వేస్తున్నారు. బోర్ల కింద వరిపైరు సాగు చేస్తున్నారు. ఈఏడాది సాగు నీరు కూడా వస్తుండటంతో మాగాణి రైతులు నార్లు పోసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

విలువలతో కూడిన జీవితం విద్యతోనే సాధ్యం

పామూరు, ఆగస్టు 9: విలువలతో కూడిన జీవితం విద్యతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. పామూరు కేజీబీవీలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్ డే వేడుకలకు ప్రిన్సిపాల్ కటకం సజన అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కేరళ రాష్ట్రంలో జరిగిన విపత్తులో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఈవో2 కరుణకుమారి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినుల విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూర్బ విద్యాలయాలు ఏర్పాటుచేశాయన్నారు. ఈనెల 22న మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా పాఠశాలకు రెండు వాటర్ కూలర్లు బహూకరణ చేయనున్నట్లు జనసేన నాయకుడు షేక్ సందాని బాషా ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, వై.ప్రసాద రెడ్డి, ఎంపీటీసీలు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, షేక్ నాయబ్‌రూల్, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, జె.చినవెంకటేశ్వర్లు, జనసేన నాయకులు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

పామూరు, ఆగస్టు 9: మండలంలోని ప్రతి గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో పి.పుట్టారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాజిక సేవాకార్యక్రమాలు విరివిగా నిర్వహించాలి

దొనకొండ, ఆగస్టు 9: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలతో మరింత ముందుకు సాగాలని తహసీల్దార్ బి.రమాదేవి సూచించారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెను శుక్రవారం ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రభు ట్రస్టు చైర్మన్ ఆదిమూలపు ప్రభుదాస్, మల్లెల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీవ్రమైన శునకాల బెడద


సామంతపూడిలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

దర్శి, ఆగస్టు 9: దర్శి ప్రాంతంలో శునకాల బెడద తీవ్రమైంది. దర్శి పట్టణంతో పాటు సామంతపూడి తదితర గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా వీధుల్లో తిరుగుతూ ప్రజలను కరుస్తున్నాయి. దీంతో చిన్నారులు, మహిళలు బయటకు వచ్చేందుకు బయపడుతున్నారు. దర్శిలోని పొదిలి రోడ్డులో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహనదారులను కూడా వెంబడిస్తున్నాయి. సామంతపూడిలో రోడ్లపై శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కకాటుకు గురైతే సుమారు నెలరోజులు ఇబ్బందిపడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు


రామారావు, సీఐ

దర్శి, ఆగస్టు 9: దర్శి నూతన సీఐగా వై.రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. పేకాట, బెట్టింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే సహించేది లేదన్నారు. శాంతి భద్రతల పరి రక్షణకు ప్రజలు సహకారం అందించాలని కోరారు.

వైభవంగా నాగపంచమి వేడుకలు


నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ, ఆగస్టు 9: స్థానిక ఆనంద ఆశ్రమంలో శుక్రవారం నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాగేంద్రస్వామికి అర్చకులు మణిబాబు శర్మ పంచామృత అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త భైరవానందస్వామి భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణ అవసరం

పామూరు, ఆగస్టు 9: విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ నేర్చుకోవాలని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు సూచించారు. స్థానిక సరస్వతి శిశు మందిర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన డిజిటల్ అండ్ కంప్యూటర్ తరగతి గదిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి భవిష్యత్తుకు విద్యతో పాటు వృత్తి నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, పాఠశాల నిర్వాహకులు వరద ఓబులేసు, ముప్పసాని గణేష్, శేగు కృష్ణయ్య, టి.లక్ష్మణ, పిడుగు శ్రీను, షేక్ నాయబ్‌రసూల్, వాయునేని రాఘవ, కావేరి రసూల్, మితికల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం

కనిగిరి, ఆగస్టు 9: ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం ఈనెల 11న కనిగిరిలో జరుగుతుందని ఆసంఘం రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, వాటి పరిష్కారంపై తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏపీటీఎఫ్ సభ్యులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలి

కనిగిరి, ఆగస్టు 9: నేషన్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దుచేసి నీట్ యూజీ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు పీవీ శేషయ్య డిమాండ్ చేశారు. స్థానిక కృష్ణచైతన్య కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవినీతిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలతో ప్రతిభగల విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- న్యాయాధికారి భరత్‌చంద్ర
- కస్తూర్బా పాఠశాల తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

కనిగిరి, ఆగస్టు 9: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్ చంద్ర అన్నారు. శుక్రవారం కనిగిరి - కందుకూరు రోడ్డులోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం రుచి చూసి విద్యార్థినులకు పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై విచారించారు. తరగతి గదులను, హాస్టల్ గదులను పరిశీలించారు. టాయిలెట్స్ , మంచినీటి వసతిపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయినులకు సూచించారు. వంటశాలను పరిశీలించి ప్రతిరోజూ విద్యార్థినులకు పెట్టే ఆహారాన్ని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.

కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, కేజీబీవీ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ కరీం

దర్శి, ఆగస్టు 9: విద్యుత్ అక్రమ వాడకానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఈ ఎస్ఏ కరీం హెచ్చరించారు. దర్శిలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మీటర్లు లేకుండా కరెంట్ వాడుకుంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అక్రమ వెంచర్లల్లో కూడా తక్కువ మీటర్లకు డబ్బులు కట్టి ఎక్కువ కనెక్షన్లు తీసకుంటున్నట్లు సమాచారం వస్తుందన్నారు. అన్నీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అక్రమ విద్యుత్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని సిబ్బందికి ఆదేశించారు. నిర్లక్ష్య వైఖరి అవలంబించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాగా, విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. 44 మంది అధికారులు, 88 మంది సిబ్బంది బృందాలుగా గ్రామాలకు వెళ్లి 3520 సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడ్ వాడుతున్న 13 మందికి రూ.44,500 జరిమానా విధించారు. ఇతర క్యాటగిరి కింద అక్రమ కరెంట్ వాడుతున్న ఐదుగురిని గుర్తించి రూ.22వేలు జరిమానా విధించారు. మీటర్లు లేకుండా అక్రమ కరెంట్ వాడుతున్న ఆరుగురికి రూ.12 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఈ కె.పిచ్చయ్య, డీపీఈ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఏఈ మౌలాలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 9: కనిగిరి మోడల్ స్కూల్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులోగల మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటుపై పంచాయతీ రాజ్ అధికారులతో కలసి ప్రాంగణం అంతా కలియతిరిగారు. ప్రహరీ గోడ ఏర్పాటుకు అయ్యే ఖర్చును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో మంచినీటి వసతి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై అధికారులతో చర్చించారు. త్వరలోనే స్కూలు ప్రహరీ గోడ నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అందుకోసం చేపట్టాల్సిన కార్యాచరణను, ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మోడల్‌స్కూల్‌లో ఉన్న హాస్టల్, తరగతి గదులను పరిశీలించారు. హాస్టల్‌లో వసతులు, అందుతున్న భోజనాన్ని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళపై కొడవలితో దాడి


108 అంబులెన్స్ వెళ్లకుండా అడ్డుగా పెట్టిన ట్రాక్టర్


దాడిలో గాయమైన మహిళ చేయి

కనిగిరి, ఆగస్టు 9: గడ్డికోసుకుంటున్న మహిళపై కొడవలితో దాడిచేసి గాయపరచిన ఘటన శుక్రవారం మండలంలోని ఏరువారిపల్లి గ్రామ పొలాల్లో చోటుచేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. పాశం శ్రీలక్ష్మి తమ పొలంలో గడ్డి కోసుకుంటుంది. అదే గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి ఈపొలం మాది, గడ్డి కోసుకుంటే ఊరుకోమంటూ గొడవకు దిగాడు. ఆమె వినకుండా గడ్డి కోసుకుంటుండగా కాలితో తన్ని శ్రీలక్ష్మి చేతిలో ఉన్న కొడవలి తీసుకుని దాడి చేయబోయాడు. దీంతో ఆమె తమ చేతిని అడ్డుపెట్టడంతో రక్తస్రావమై పొలంలోనే అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. సమాచారం అందుకున్న బాధిత మహిళ బంధువులు 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు.

క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలించేందుకు వస్తున్న అంబులెన్స్‌కు దాడికి పాల్పడిన తిరుపాల్‌రెడ్డి తన ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టాడు. దీంతో చేసేదిలేక అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రురాలు ఉన్న పొలం వద్దకు వెళ్ళి బంధువుల సాయంతో అంబులెన్స్ వద్దకు తీసుకువెళ్ళి కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఆలయ భూములకు ఎసరు!

- అక్రమంగా పట్టాల పంపిణీ
- నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల తీరు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్


పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయం

వరికుంటపాడు, ఆగస్టు 9: సామాన్యులకు సెంటు భూమి కేటాయించేందుకు సవాలక్ష నిబంధనలను సాకుగా చూపే రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఏకంగా ఆలయ భూములకే ఎసరు పెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లతో పకడ్బందీగా రికార్డులను రూపొందించి అక్రమంగా పట్టాలు అందచేశారు. దీన్ని బట్టి చూస్తే మండల అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసు కోవచ్చు. వారి పనితీరుకు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామ రెవెన్యూలో జరిగిన భూబాగోతమే నిదర్శం.

ఫిర్యాదుతో వెలుగులోకి...

ప్రకాశం జిల్లా పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయానికి వేంపాడు గ్రామంలో భూములు ఉన్నాయి. పామూరుకు చెందిన కొందరు వ్యక్తులు వాటిపై కన్నేశారు. స్థానికుల సహకారంతో రెవెన్యూ అధికారులను లోబర్చుకొని సర్వే నంబరు 78-1లోని 6.08 ఎకరాల భూమిని 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆలయ కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు అమ్మినట్లుగా బినామీ రికార్డులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేకాక దేవదాయశాఖ అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడం లేదని పట్టాలు పొందిన వ్యక్తులు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది సెప్టెంబరు 2న నోటీసులు అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు, 1948 నుంచి ఆలయానికి సంబంధించిన పూర్తి రికార్డులను ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం జేసీ కోర్టులో సాగిన విచారణలో ఆ భూమిలో పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లను తొలగించి యథావిధిగా ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబరు 26న తీర్పు ఇచ్చారు. దీంతో ఆలయ ఈవోతోపాటు కమిటీ సభ్యులు తమకు న్యాయం జరిగిందని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. అప్పటి నుంచి ఆలయ కమిటీ సభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి గతంలో రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని, ఆక్రమిత భూములను ఆలయ ఆస్తిగా రికార్డులో నమోదు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు.


ఆలయ భూమిలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బోర్డు


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రేమ్‌కుమార్

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 9: నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లిలోని జడ్పీ పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సుకు హెచ్ఎం నాగినేని తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మూరం మస్తానయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కనిగిరి, ఆగస్టు 9: వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలోని పామూరు రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని కొత్తూరులో నివాసం ఉంటున్న కర్నాటి వీరారెడ్డి (45) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. కనిగిరిలో పనులు ముగించుకొని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి మోటర్ బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో భారత్ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి బైక్ ఆగిపోయింది. బైక్‌ను స్టార్ట్ చేస్తున్నక్రమంలో వింజమూరు వెళుతున్న లారీ ఇను పకమ్మీ వీరారెడ్డి చొక్కాను తగులుకుని ఈడ్చుకెళ్ళటంతో వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలికి వచ్చి గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కలచివేసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వీరారెడ్డి మృతితో కొత్తూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఆరు రోజుల్లో.. అన్న క్యాంటీన్లు

- పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధమవుతున్నాయి
- పురపాలక సంఘాల ఆధ్వర్యంలో శరవేగంగా పనులు
- వైసీపీ పాడుపెట్టగా.. కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ
- తుది దశలో పనులు.. 15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- పేదల ఆహార భద్రతకు కట్టుబడిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో 26 క్యాంటీన్ల పునరుద్ధరణ



బాపట్లలో ముస్తాబైన అన్న క్యాంటీన్

ఆకలితో ఎవరూ ఉండకూడదు.. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం పేదలకు అందుబాటులో ఉండాలి.. అనే సదాశయంతో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. అయితే పేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాడుపెట్టింది. ఎన్ని విమర్శలు వచ్చినా జగన్ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వం పేదల కడుపు కొట్టగా నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై దృష్టి సారించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ దిశగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలివిడతలో ఎంపిక చేసిన అన్న క్యాంటీన్ల ప్రారంభానికి అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. తుది దశకు ఆయా పనులు చేరగా ఇక ఆరు రోజుల్లో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఇటీవల మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా పరిశీలించారు. అన్న క్యాంటీన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని పేదలతో పాటు సామాన్యులు, దిన సరి కూలీలు ఎదురుచూస్తున్నారు.

(గుంటూరు, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి, బాపట్ల, తెనాలి, మారీసుపేట)

మరో ఆరు రోజుల్లో.. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారంతో పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టిన అన్న క్యాంటీన్ భవనాలను అధికారులు పునరుద్ధరించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లు సిద్ధమయ్యాయి. గతంలో ఎలా ఉన్నాయో అలానే క్యాంటీన్ భవనాలను పునరుద్ధరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 26 క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను మున్సిపాల్టీలు చేపట్టాయి. గడిచిన నెలరోజులుగా నిర్వహిస్తున్న మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తై భవనాలు కొత్త కళను సంతరించుకున్నాయి. విద్యుత్ సరఫరా, కొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్ సమీకరణ వంటి మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో అన్న క్యాంటీన్లన్నీ కొత్త శోభగులతో సిద్ధం కానున్నాయి. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ పనులను పేదలు వచ్చి ఆశక్తిగా పరిశీలిస్తున్నారు. 15న ప్రారంభానికి సిద్ధమవుతుండటంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ తమ ఆకిలి తీర్చేందుకు క్యాంటీన్‌లు ప్రాంభించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేదలు అయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. క్యాంటీన్ల ద్వారా ఒక్కొక్క చోట ఐదు వందల మందికి అల్పాహారం, భోజనం అందించే దిశగా ఏర్పాట్లు జరగుతున్నాయి. అల్పాహారం ఇడ్లీ, పూరి, ఉప్మా ఇలా రోజుకొక రకం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. భోజనంలో ఒక కూర, సాంబారు, పెరుగు, రైస్ వడ్డించనున్నారు.

● నాడు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పురపాలక సంఘాల్లో మొ త్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు 5 రూపాయలకే టిఫిన్, భోజనం లభించేది. కేవలం 15 రూపాయలతో ఒక పేద వాడికి రోజు గడిచి పోయేది. నగర, పట్టణ ప్రాంతాల్లో ఉండే అభాగ్యులు హాయిగా కడుపు నింపుకునేవారు. భిక్షాటకులకు అన్న క్యాంటీన్ ఒక వరంలా మారాయి. ఆకలితో పస్తులుం డాల్సిన బాధ వారికి తప్పింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినకూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. అలాంటి అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. అయినా టీడీపీ శ్రేణులు వీలైన ప్రతి చోటా తమసొంత డబ్బులు ఖర్చు చేసి అన్నా క్యాంటీన్లను నిర్వహించారు. దానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లో అన్న క్యాంటీన్లు ప్రా రంభించి పేదల ఆకలితీర్చేందుకు పూనుకుంది.

- తెనాలిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో అన్నక్యాంటీన్ల పనులను మున్సిపల్ అధికారులు పూర్తి చేస్తున్నారు.
- బాపట్లలోని సూర్యలంకరోడ్డులో పాతకోర్టు భవనం పక్కనే 2018లో అప్పటి ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ రూ.36లక్షల వెచ్చించి అన్నక్యాంటిన్ భవనాన్ని నిర్మించగా వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరింది. దీనిని రూ.10 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న అన్నక్యాంటిన్‌ను ఈ నెల 15న ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.
- గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 8 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. నగరంలోని వ్యవసాయ కార్యాలయం,ఐడీ ఆస్పత్రి, జేకేసీ కళాశాల రోడ్డులోని టీడీపీ కార్యాలయం, మిర్చియార్డు, నల్లచెరువు వాటర్ ట్యాంకు, గుంటూరు బస్టాండు, మార్కెట్ సెంటర్లోని పల్నాడు బస్టాండ్ సెంటర్, పెదకూరపాడు రోడ్డులో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో గుంటూరు బస్టాండు, పల్నాడు బస్టాండు వద్ద ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల పనులు పూర్తయ్యాయి. మంగళగిరి పాత బస్టాండు, తాడేపల్లి, ఉండ వల్లిలోని సీఎం ఇంటి వద్ద, రాష్ట్ర సచివాలయం వద్ద అన్న క్యాంటీన్లు పునఃప్రారంభానికి సిద్ధ మయ్యాయి. మిగిలిన క్యాంటీన్లను సెప్టెంబరు 21లోగా ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతోంది.



రేపల్లెలో సిద్ధమైన అన్న క్యాంటిన్



గుండెపోటుకు చెక్

- హార్ట్‌స్ట్రోక్ మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- హార్ట్ కేర్ హబ్‌గా గుంటూరు జీజీహెచ్ ఎంపిక
- సామాన్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం హార్ట్ కేర్ సర్వీసులు
- సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఖరీదైన టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి

గుండెపోటు.. ఎప్పుడు ఎలా ఎవరికి వస్తుందో తెలియదు. సకాలంలో చికిత్స చేయించుకోలేక ఎందరో మరణిస్తుంటారు. ఖరీదైన ఈ వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదు. పైగా గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గుండెపోటు మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంట చాలా కీలకం. ఆ సమయంలో ప్రాథమిక చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. అందుకు చాలా ఖర్చు అవుతుంది. ఆ ఖర్చును భరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుంకట్టింది.

గుంటూరు సిటీ, ఆగస్టు 9: గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలు కాపాడే అతి ఖరీదైన ఇంజక్షన్ సామాన్యులకు అందుబాటులో తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అనుమతి ఇచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాను హార్ట్ కేర్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా జీజీహెచ్‌ను హార్ట్ కేర్ హబ్‌గా మార్చనున్నారు. గుండెపోటు సంభవించిన తొలి గంటను గోల్డెన్ అవర్ అని వైద్యులు చెబుతారు. ఆ తొలి గంటలో చేసే ప్రాథమిక వైద్యం రోగికి ప్రాణం పోస్తుంది. ప్రస్తుతం గుండెపోటు వచ్చిన వారికి టెనెక్ట్ ప్లేస్ అనే ఇంజెక్షన్ ఇస్తున్నారు. ఈ ఇంజె క్షన్‌కు గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించే శక్తి ఉం టుంది. దీని విలువ సుమారు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. చాలా సందర్భాల్లో ఆ ఖర్చు భరించలేక సామాన్యు లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్‌ను సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. స్పోక్స్ సెంటర్లలో టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ ఉచితంగా ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండె పోటు వచ్చిన వారికి ఆయువు పోసే ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఆయా సామాజిక ఆరోగ్య కేంద్రాలను గుండె పోటు బాధితులు ఉండేందుకు తగ్గట్లుగా తీర్చిదిద్దనున్నారు. అక్కడ ప్రాథమిక చికిత్సలో భాగంగా రోగికి టెనెక్ట్ ప్లేస్ ఇం జెక్షన్ ఇచ్చి పరిస్థితి స్టేబుల్ చేసిన తర్వాత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు. ఆయా స్పోక్స్ సెంటర్ల నుంచి వచ్చే కేసులను అత్యంత ఎమర్జెన్సీగా భావించి వారికి అవ సరమైన ఏంజియో గ్రామ్, స్టెంట్ ప్రక్రియను ప్రారంభిస్తారు.

గుంటూరే కీలకం

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు ప్రకారం గుంటూరు, నెల్లూరు, వైజాగ్, కడప జిల్లాల్లో మాత్రమే గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభ విస్తు న్నాం యి. గుంటూరు జిల్లాలో అసం క్రమిత వ్యాధుల్లో ఎక్కువ శాతం మరణాలు గుండె పోటు వల్లే జరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. ఈ జిల్లా లో 49 సంవత్సరాల వయస్సు లోపు ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. 60 సంవత్సరాల వయస్సు తర్వాత మొత్తం గుండె జబ్బుల కేసుల్లో 21 నుంచి 25 శాతం మాత్రమే ఉంటున్నాయి. జిల్లాలో సంభవిస్తున్న మరణాల్లో 31 శాతం గుండె పోటు వల్లే ఉం టున్నాయి. వారిలో 75 శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆయా వర్గాలకు టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ అందుబాటులోకి రావడం వల్ల మధ్యంతర మరణాలు నివారిం చవచ్చునని కూటమి ప్రభుత్వం ఖర్చుతో కూడిన వైద్యానికి శ్రీకారం చుట్టింది.



గుండె పోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరు గుతున్న నేపథ్యంలోనే కార్డియాలజీ, కార్డియో వాస్క్యులర్ సేవలను మరింతగా విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలన్న ఆలోచన లో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ వ్యవస్థను వినియోగించి గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. గుండె పోటుకు గురైన వ్యక్తిని గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని స్పోక్స్ సెంటర్‌కు తరలి స్తారు. అవసరమైన సిబ్బందిని కూడా నియ మించే అవకాశం ఉంది.

జెండా ఆవిష్కరణపై స్పష్టత

- గుంటూరులో లోకేశ్, పల్నాడులో మనోహర్, బాపట్లలో రవిలకు అవకాశం

జిల్లాలకు మంత్రులను కేటాయించిన ప్రభుత్వం



గుంటూరు సిటీ/ నరసరావుపేట, బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తోంది. జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే దృష్టి సారించారు. వేడుకల ఏర్పాట్లపై యంత్రాంగం సమీక్షిస్తోంది. స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రుల నియామకం చేయలేదు. దీంతో జెండా ఆవిష్కరణ చేసే మంత్రులపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో జెండా ఆవిష్కరణలో పాల్గొనే అమాత్యుల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆగస్టు 15న జిల్లాల్లో జెండా వందనం చేసే మంత్రుల జాబితా శుక్రవారం ఖరారైంది. గుంటూరు జిల్లాలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పల్నాడు జిల్లాలో ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, బాపట్ల జిల్లా లో ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ జెండా వందనం చేయను న్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి హోదాలో నాదెండ్ల మనోహర్ గతంలో జాతీయ జెండాను ఆవిష్కరించగా నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ మంత్రుల హోదాలో జెండా వందన కార్యక్రమాల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

గుంటూరుదే ఆ ఘనత

రాజకీయ చైతన్యానికి మారుపేరైన గుంటూరు జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వారిలో రాజకీయ ఉద్ధండులు ఉన్నారు. ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించిన వారు తర్వాత కాలంలో ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. ఇది గుంటూరుకు ఓ ప్రత్యేక ఘనతగా కొనసాగింది. కాసు బ్రహ్మానందరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, కొణిజేటి రోశయ్య అప్పట్లో జిల్లా మంత్రుల హోదాలో గుంటూరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత కాలంలో వారు ముఖ్యమంత్రులుగా రాష్ట్ర రాజధానిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన గుంటూరు జిల్లా కేంద్రంలో మంత్రి లోకేశ్‌కు ఈసారి జాతీయ జెండా ఆవిష్కరించే అవకాశం దక్కింది.

రేంజిలో మరికొందరు సీఐల బదిలీ



గుంటూరు, ఆగస్టు 9: గుంటూరు రేంజ్ పరిధిలో మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి శుక్రవా రం ఉత్తర్వులు జారీ చేశారు. గడిచిన కొద్దిరోజులుగా బదిలీల ప్రక్రియ కొనసాగుతున్న విషయం విధితమే. తాజాగా బదిలీ అయిన వారిలో ప్రకాశం జిల్లా పామూరు సీఐ ఎం రామానాయక్‌ను వట్టి చెరుకూరుకు, సీఐడీలో ఉన్న ఎన్ కిశోర్‌బాబును గూడూరు రూరల్‌కు, మద్ది శ్రీనివాసరావును నెల్లూరు త్రీ టౌన్‌కు బదిలీ చేశారు. వెంకటగిరిలో విధులు నిర్వహిస్తున్న ఎన్ సంగమేశ్వరరావును నాయుడు పేట రూరల్‌కు, ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభా గంలో ఉన్న ఏ వెంకటరమణను వెంకటగిరికి, ఏసీబీ లో ఉన్న జీఎల్ శ్రీనివాసరావును మార్టూరుకు, వీఆర్ లో ఉన్న వైవీ రమణయ్యను ఇంకొల్లుకు, వై పాండు రంగారావును ఒంగోలు ట్రాఫిక్‌కి, బీ హరికృష్ణను బాపట్ల రూరల్‌కు, నెల్లూరు సీసీఎస్‌లో విధులు నిర్వ హిస్తున్న కామరాజు గడ్డ సాంబశివరావును నెల్లూరు ఆరో టౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

12 మంది ఎస్ఐల బదిలీ

వీఆర్‌కు ఆరుగురు

బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్ద ఎత్తున పోలీసు అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. సీఐలకు సంబంధించి జిల్లాలో గురు, శుక్రవారాల్లోనే ఐదుగురికి పోస్టింగ్ ఇస్తూ గుంటూరు రేంజి ఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐల విషయానికి వస్తే ఒకేసారి 12 మందికి స్థానచలనం కలిగించగా, ఆరుగురిని వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాలిచ్చారు. నిజాంపట్నం, భట్టిప్రోలు, బల్లికురవ, చినగంజాం, ఇంకొల్లు, ఈపురుపాలెం ఎస్ఐలను వీఆర్‌కు పంపించారు. ఈపూరుపాలెం పరిధిలో జరుగుతున్న వరుస నేరాల పరంపర కూడా సదరు ఎస్ఐను వీఆర్‌కు పంపడానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున జరిగిన సీఐలు, ఎస్ఐల బదిలీల విషయంలో రాజకీయ సిఫారసులే కొలమానంగా జరిగినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి దాదాపుగా రెండు నెలల వ్యవధి తర్వాత కానీ పోలీస్ అధికారుల పోస్టింగ్ విషయంలో స్పష్టత వచ్చింది. ఇంత వ్యవధి తీసుకోవడం పట్ల పోలీసు వర్గాల్లోనే ఓ దశలో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ జాప్యం వెనక నేతల సిఫారసులే కారణంగా ఉంది.

మేయర్ పదవిపై దోబూచులాట

- కార్పొరేటర్లు క్యూ కట్టడంతో టీడీపీకి మెజారిటీ
- పదవిపై హామీ కోసం మేయర్ ప్రయత్నాలు
- చంద్రబాబుదే తుది నిర్ణయమన్న ఎమ్మెల్యే దామచర్ల
- 12న మరోసారి భేటీ కావాలని నిర్ణయం
- ఇదీ ఒంగోలు కార్పొరేషన్ రాజకీయ వ్యవహారం

ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ పదవి విషయమై దోబూచులాట జరుగుతోంది. కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు క్యూ కట్టడంతో కార్పొరేషన్‌లో వైసీపీ అధిపత్యానికి గండిపడటం ఖాయమని తేలిపోయింది. రానురాను టీడీపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య పెరిగిపోతోంది. అదేసమయంలో మేయర్ గంగాడ సుజాత వ్యవహారశైలి చర్చనీయాంశమైంది. పూర్తి కాలం తనను మేయర్‌గా కొనసాగించేలా హామీ తీసుకొని టీడీపీలోకి అడుగు పెట్టాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. ఆ విషయం చంద్ర బాబు తేల్చాలని ఎమ్మెల్యే జనార్దన్ ఆమెకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ మారే విషయంలో మేయర్ సుజాత నిర్ణయం వెల్లడి కాకపోగా వైసీపీ కార్పొరేటర్లు మాత్రం రోజుకు ఇద్దరు ముగ్గురు టీడీపీలో చేరుతున్నారు. శుక్రవారం జరిగిన కొన్ని పరిణామాల అనంతరం ఈవిషయంలో తదుపరి నిర్ణయాలను ఎమ్మెల్యే జనార్దన్ సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది.



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ వైపు దృష్టి సారించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పక్షాన ఆరుగురు, జనసేన తరఫున ఒకరు గెలుపొందారు. వైసీపీ నుంచి 42 మంది, స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఆతర్వాత స్వతంత్ర అభ్యర్థి కూడా వైసీపీలో చేరడంతో ఆ పార్టీ కార్పొరేటర్ల బలం 43కు చేరింది. గత అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభంకాగానే ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఆ తర్వాత పేర్నమిట్ట ప్రాంత కార్పొరేటర్ సైకిలెక్కారు. గురువారం మరో నలుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం 50వ వార్డు కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, 17 వార్డు కార్పొరేటర్ శేషగిరిరావు చేరారు. దీంతో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ల సంఖ్య 11కు చేరింది. టీడీపీ కూటమి బలం 18 అయింది. కాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ బుజ్జి, శ్యాండిల్య, పద్మావతి, అలాగే మూడో డివిజన్ కార్పొరేటర్ భర్త, రెండో డివిజన్ కార్పొరేటర్ గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది వైసీపీలో చేరిన గోపి ఉన్నారు. ఈ ఆరురుగు కూడా చేరితే కార్పొరేషనల్‌లో కూటమి బలం 24 అవుతుంది. వీరు కాక కోఆప్షన్ సభ్యులుగా ఒంగోలు ఎంపీ మాగుంట, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్‌లు ఉంటారు. వారి ఓట్లతో కలిసి కార్పొరేషన్‌లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది

ఇక తేలాల్సింది మేయర్ వ్యవహారమే

నగర మేయర్ గంగాడ సుజాత గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిశారు. ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. మొదటి నుంచి మేయర్ సుజాత కచ్చితమైన నిర్ణయంతో ముందుకు సాగడం లేదు. ఒకసారి జనార్దన్‌ను కలిశారు. ఆతర్వాత రెండు రోజులకే హైదరాబాద్ వెళ్లి మాజీ మంత్రి, వైసీపీ నేత బాలినేనితో భేటీ అయ్యారు. ఇటీవల ఢిల్లీలో వైసీపీ అధినేత జగన్ చేపట్టిన ధర్నాకు హాజరయ్యారు. దీంతో పార్టీ మారే ఆలోచనను మేయర్ మార్చుకున్నారన్న భావనకు టీడీపీ నాయకులు వచ్చారు. అయితే ఆమె టీడీపీలో చేరాలనుకుంటున్న కొందరు కార్పొరేటర్లతో పాటు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దామచర్లను మళ్లీ కలిశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జనార్దన్, సుజాత మధ్య మేయర్ పదవిపైనే చర్చ జరినట్లుగా తెలిసింది. పూర్తికాలం మేయర్‌గా కొనసాగాలన్న తన ఆలోచనను సుజాత వ్యక్తంచేసినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే జనార్దన్ మేయర్ పదవి విషయంలో సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయమే మాకు శిరోధార్యమని, మేము ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోబోమని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వద్దే చేరికల కార్యక్రమం పెడితే తాము ముందుగానే తమ ఆలోచనను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్న అభిప్రాయాన్ని మేయర్‌తోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న కొందరు కార్పొరేటర్లు చెప్పినట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే జనార్దన్ స్పందిస్తూ.. పార్టీలో చేరాల్సిన, చేరిన కార్పొరేటర్లను సీఎం వద్దకు తీసుకెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని చెప్పారు. తాను హైదరాబాద్‌లో శుభ కార్యానికి హాజరు కావాల్సి ఉందని, సోమవారం మళ్లీ కలుద్దామని చెప్పినట్లు తెలిసింది.

టీడీపీలో చేరిన ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 9: వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరారు. ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో ఆయన సమక్షంలో 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకటశేషయ్య కలిసి సైకిలెక్కారు. వారికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు.



గురకాయపాలెం పాఠశాలలో మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఎల్ఐసీ అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 9: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి. మాధవ్‌కృష్ణ అన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని గురకాయపాలెం ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ మాజీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళ ఉపాధ్యాయులకు తులసి మొక్కలు అందజేయడంతో పాటు పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పలు రకాల పండ్లు, ఇతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, హెచ్‌యంలు రామిశెట్టి శ్రీనివాసరావు, ఎల్.సుజాత, ఎల్ఐసీ ఏబీఎం షేక్ ఖాదర్ మస్తాన్, సత్యనారాయణ, కే. వినోద్, రఫీ, మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



కేరళ బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 9 : కేరళ రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న బాధితుల కోసం శుక్రవారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇంకొల్లులో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రూ.25,000లు విరాళం సేకరించి రాష్ట్ర కమిటీకి అందజేయనున్నట్లు బాధ్యులు కందిమళ్ల రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

గొప్ప గ్రంథం 'నేటి నిజం'



రామాంజనేయులు రాసిన నేటి నిజం కావ్యావిష్కరణలో సినీ నటుడు తిలక్ తదితరులు

అద్దంకిటౌన్, ఆగస్టు 9: ప్రజా సమస్యలకు పరిష్కారాన్ని చూపించే గొప్ప గ్రంథం నేటి నిజం అని ప్రముఖ సినీ నటుడు తిలక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలోని రెస్టారెంట్‌లో అద్దంకికి చెందిన రచయిత చెన్నుపాటి రామాంజనేయులు రాసిన నేటి నిజం కావ్యావిష్కరణ శతాధిక గ్రంథకర్త కవి పి.సౌభాగ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాన్ని తిలక్ ఆవిష్కరించారు. అధునిక సమాజంలో నిత్యం జరిగే సంఘటలను తనదైన విమర్శనా పద్ధతిలో పద్య రచన సాగిందని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి బీరం సుందరరావు నేటి నిజం గ్రంథంపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ తెలంగాణ పూర్వ అధ్యక్షుడు కె. వేణుగోపాల్, అనువాద రచయిత అనిశెట్టి శంకర్, కథ, రచయిత్రి తుర్లపాటి లక్ష్మీ, ఎస్‌వీ రాఘవయ్య, చెన్నుపల్లి నాగేశ్వరరావుతో పాటు రామాంజనేయులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అద్దంకి, ఆగస్టు9: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అద్దంకి పట్టణంలోని చక్ర సహిత వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు. గణపతి, అమ్మవార్లకు అభిషేకం, అర్చన, నవగ్రహ, వాసవి, శ్రీసూక్త, దుర్గాసూక్త హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: దేశంలోని వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పెంట్యాల హనుమంతరావు, పీవీఆర్.చౌదరి, జీవీ.కొండారెడ్డి, ఎస్.లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్‌శక్తులకు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రత్యక్ష పనులను దేశంలో 30శాతం నుంచి 20శాతానికి తగ్గించడం దుర్మార్గంగా ఉందన్నారు. దీంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, పద్మ, ఎంఎస్.సాయి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ శ్రీనివాసరావు, ఆర్.వెంకట్రావు, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు ఉద్యమించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎల్ఐసీని దెబ్బతీసేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయలో ఎల్ఐసీఏఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రం, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసీ అత్యంత ముఖ్యమైన బ్రాండ్‌లలో మూడవ స్థానంలో ఉందన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసాను, సామాజికభద్రతను అందించడమే కాకుండా దేశానికి ఉపయోగపడే అనేక ప్రాజక్టులకు ఆర్థిక సహకారాన్ని ఎల్ఐసీ అందిస్తుందని చెప్పారు. అటువంటి సంస్థను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, దీనిని అడ్డుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బీవీ.రమణయ్య, కె.రమణారెడ్డి, డి.మధుబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంలో రివ్యూ పిటిషన్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసినట్లు మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో సివిల్ అప్పీల్‌లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు జస్టిస్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన వర్గీకరణ తీర్పును ఆర్టికల్ 137 ప్రకారం రివ్యూ కోరటం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీకులాల రిజర్వేషన్లు వర్గీకరణ చేస్తూ 1997లో అప్పటి ప్రభుత్వం చట్టం తెచ్చిందన్నారు. దీనిని సవాల్ చేస్తూ మాలమహాసభతో పాటు మరికొన్ని సంఘాలు ఉమ్మడి హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్‌ను జస్టిస్ లిబర్‌హాన్ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహాసభ ముందుండి పోరాడుతుందని చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, కొండమూరి ప్రకాష్, కురుగుంట్ల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9: గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పొన్నలూరు, కనిగిరిలో గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గురుకులాల పెండింగ్ పనులను పూర్తిచేసి త్వరలో అందుబాటులో తేస్తామన్నారు. గిరిజనులలో అక్షరాస్యత పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మరింత ప్రయోజనం కల్పించేలా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టళ్లను గురుకులాలుగా మార్చిన చోట తలెత్తుతున్న పరిపాలనాపరమైన సమస్యల పరిష్కారానికి గిరిజన శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ రీజనల్ ఆఫీసు జిల్లాలో ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. శ్రీశైలం వెళ్లే మార్గాన్ని నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడంతోపాటు అర్హులైన గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేస్తామని మంత్రి స్వామి తెలిపారు. డీఎస్సీ రాసే ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతి, శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులందరికీ ఆధార్ కార్డులు ఉండేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పా టు చేశామన్నారు. గిరిజన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు

ఈ సందర్భంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని, ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ శిబిరాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం ఎర్రగొండపాలెం దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోని 383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. గిరిజన భవనానికి నాలుగు కూలింగ్ వాటర్ బబుల్స్‌ను గిరిజన నాయకులు ప్రసాద్ బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, సంక్షేమశాఖల అధికారులు లక్ష్మానాయక్, అర్జున్ నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు లక్ష్మయ్య, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, మాల్యాద్రి, సైదా నాయక్, మోగన్న, స్థానిక కార్పొరేటర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ నుంచి గిరిజన భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

రీకౌంటింగ్ కాదు..చెకింగ్!

ఒంగోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని 12 పోలింగ్ కేంద్రాల్లో డమ్మీ బ్యాలెట్‌లతో చెకింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇది రీ కౌంటింగ్ కాదని ఆమె స్పష్టం చేశారు. డమ్మీ బ్యాలెట్‌ను ఈవీఎంలలో చూపించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఒంగోలులో శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. మొత్తం 12 పోలింగ్ కేంద్రాలపై అనుమానాలు ఉన్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఈనెల 19నుంచి 24వతేదీ వరకు రోజుకు రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధించి బెల్ కంపెనీ, ఎన్నికల కమిషన్ నుంచే ప్రతినిధులు వచ్చి డమ్మీ బ్యాలెట్ పేపర్లను ఈవీఎంలను పెట్టి చెక్ చేసి చూపిస్తారని తెలిపారు.

దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: బాలసదన్, శిశుగృహంలోని ఆరేళ్లలోపు పిల్లలను త్వరగా దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లీగల్ దత్తత రికార్డులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బాలసదనంలోని పిల్లలు స్కూలుకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని, ఎవరూ కూడా హోమ్‌లో ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నిలీమ, వంశీలత, శివశంకర్, సుమన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, డీపీవో బాలప్రభాకర్, లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

పశుపోషకులకు గడ్డి విత్తనాల పంపిణీ

మార్టూరు, ఆగస్టు 9: స్థానిక పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులమేత కోసం పశుపోషకులకు గడ్డి విత్తనాలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో రైతులకు జొన్నరకం గడ్డి విత్తనాలు 3 కిలోల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. పశుసంపద గలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పీడీసీసీబీ నికర లాభం రూ.1.47కోట్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 9: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.47 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఒంగోలులోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మహాజన సభలో గత ఆర్థిక సంవత్సరంపు ఆడిట్ నివేదికను ఆమోదించారు. బ్యాంకు అధికారి పీఐసీ జాయింట్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధ్యక్షతన మహాసభ జరిగింది. ఆడిట్ నివేదిక ప్రకారం బ్యాంకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.11 కోట్ల లాభాలు ఆర్జించింది. అయితే ఈ మొత్తం నుంచి బ్యాంకు రిజర్వు నిధి, ఇన్వెస్టిమెంట్ ప్లక్చ్యుమిషన్, ట్యాక్స్ లయబిలిటి తదితరాలు పోను బ్యాంకుకు నికరంగా రూ.1.47 కోట్లు రాబడి వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి, సీఈవో కొండారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: జిల్లాలో 2047 నాటికి అన్ని రంగాల్లో జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ అభివృద్ధిలో మహిళలను కూడా భాగస్వాములు కావడం అత్యంత కీలకమన్నారు. ఈ దిశగా బ్యాంకు రుణాలు ఇచ్చి స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చేందుకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలు, బ్యాంకుల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 9500 ఎస్‌హెచ్‌జీ మహిళలతో ఈ ఆర్థికసంవత్సరం రూ.133కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించేలా చేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి మహిళ లక్ష రూపాయాలకు పైగా పెట్టుబడి పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా వారికి రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. పేదరికం లేని ప్రకాశం జిల్లా ఆవిష్కృతం కావడానికి బ్యాంకర్లు కూడా తమవంతు పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, ఎల్‌డీఎంలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు.

సమావేశంలో పలు శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, రమణ, శ్రీనివాసరావు, గోపీచంద్, చంద్రశేఖర్‌రెడ్డి, బేబీరాణి, జి.శ్రీనివాస్, ఎల్‌డీఎం రమేష్, నాబార్డు డీడీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- 15న జెండా ఆవిష్కరించనున్న మంత్రి స్వామి
- ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షలు చేసి శాఖల వారీ బాధ్యతలను అప్పగించారు. ఒంగోలులో నిర్వహించే జిల్లాస్థాయి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఇన్‌చార్జి మంత్రులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి రెండునెలలే కాగా ఇంకా ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరగలేదు. ఈనేపథ్యంలో ఆగస్టు 15న ఎవరు జెండా ఆవిష్కరించాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లాకు చెందిన మంత్రి డా క్టర్ స్వామి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఏటా ఘనంగానే నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏ ర్పడటం, మంత్రి, కలెక్టర్, ఎస్పీలు కొత్తవారు కావడంతో మరింత భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రెవెన్యూ ప్రజాదర్బార్‌కు ఏలూరి శ్రీకారం

- 21న భూ సమస్యలపై వినతుల స్వీకరణ

పర్చూరు, ఆగస్టు 9: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రెవెన్యూ ప్రజా దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. ఈనెల 21వ తేదీన పర్చూరు మార్కెట్ యార్డు వేదికగా కార్యక్రమం చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సమస్యలకు పరిష్కారం చూపేలా..

రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా డివిజనల్, మండల రెవెన్యూ అధికారులతో రెవెన్యూ దర్బార్ కొనసాగనుంది. భూమి హద్దులు, అసైన్డ్ సమస్యలు, తప్పుడు తడకగా ఉన్న భూముల వివరాల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. దీనిపై అన్నదాతలు ఎమ్మెల్యే ఏలూరికి విన్నవించుకున్న నేపథ్యంలో స్పందించిన ఏలూరి రెవెన్యూ దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి, చినగంజాం, మార్టూరు మండలాలకు చెందిన తహసీల్దార్లను భాగస్వాములను చేస్తూ ప్రణాళిక రచించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి పరిష్కారానికి చొరవ చూపేలా ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. మండల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు.

సమస్యలకు మోక్షం..

అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారమే ధ్యేయంగా వినూత్న రీతిలో ఎమ్మెల్యే ఏలూరి రెవెన్యూ దర్బార్‌లు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీచేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగం అనేక రెవెన్యూ సమస్యలతో సతమతమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు వైసీపీ ప్రభుత్వ శ్రీకారం చుట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దుచేసింది. పర్చూరు నియోజకవర్గంలో ఎనిమిది దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని 5వేల ఎకరాల ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఈభూములకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆలయ అభివృద్ధికి సహకారం అభినందనీయం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 9: కోట్ల రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రవాసాంధ్రుడు, జనసేన నాయకులు మన్నెం శ్రీకాంత్, సాయిరమ్య దంపతుల ఆర్థిక సహకారంతో రూ.40లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న వంటశాల, పూజారి గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జనసేన నాయకులు ఆలా అనిల్ కుమార్, పెదపూడి విజయ కుమార్, అరుణ, ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏలూరికి ఆలయ కమిటీ ప్రతినిధులు మేళ తాళాలు, పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా కొబ్బరి కాయకొట్టి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత స్వామివారి దర్శించుకొని పూజాకార్యక్రమాలు చేసి భక్తిని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, కఠారి సురేంద్రబాబు, కోడూరి శేషబ్రహ్మాచారి, గడ్డిపాటి శ్రీనివాసరావు, మంగళగిరి కోటేశ్వరరావు, తులసి అప్పారావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి దుర్గా ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కవి చందలూరి నారాయణరావు తదితరులు

కవి నారాయణరావుకు హైకోర్టు జడ్జి అభినందనలు

అద్దంకిటౌన్, ఆగస్టు 9: కవి చందలూరి నారాయణరావు రాసిన కవితలలో ఉన్న సరళతను, అందమైన భావ వ్యక్తీకరణను హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి యు. దుర్గా ప్రసాదరావు కొనియాడి అభినందించారు. అమరావతిలోని హైకోర్టు ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి యు. దుర్గాప్రసాదరావు ఉద్యోగ విరమణ సభకు సెంట్రల్ గవర్నమెంట్ కౌన్సిలర్, న్యాయవాది బాచిన హనుమంతరావుతో పాటు కవి చందలూరి నారాయణరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దుర్గా ప్రసాదరావుకు కవిని న్యాయవాది హనుమంతరావు పరిచయం చేశారు. గతంలో తాను రాసిన కొన్ని కవితల గురించి వివరించారు. సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో జరిగే పలు కార్యక్రమాలను న్యాయమూర్తికి వివరించారు. అలాగే నారాయణరావు రాసిన 'మనం కాసేపు మాట్లాడుకుందాం' అనే పుస్తకాన్ని చదివిన న్యాయమూర్తి నారాయణరావును అభినందించారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు - ఒకరికి గాయాలు

మేదరమెట్ల, ఆగస్టు 9: జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై కారు డివైడర్‌ను ఢీ కొన్న సంఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయి. నెల్లూరు నుంచి విజయవాడకు కారులో వెళ్తున్న ధీరజ్ వెంకటాపురం వద్ద డివైడర్ దిమ్మెలను ఢీ కొనడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి పంపించి వేశారు.

టిప్పర్, మోటార్ సైకిల్ ఢీ - ఒకరికి గాయాలు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శుక్రవారం టిప్పర్, మోటార్‌సైకిల్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై వెళ్తున్న ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.

కృష్ణ అభిమాని అన్నదానం

మార్టూరు, ఆగస్టు9:స్థానిక అమ్మ ఆశ్రమంలో శుక్రవారం స్వర్గీయ సినీనటుడు కృష్ణ జన్మదినం సందర్భంగా మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రత్నకుమార్ పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

సంధికాలపు భత్యం ఇచ్చేది ఎప్పుడో ..!

ఎదురుచూస్తున్న మత్స్యకారులు

జాప్యంపై జాలర్ల అసంతృప్తి

చీరాల, ఆగస్టు 9 : సందికాలం సమయంలో ఇచ్చే భత్యం కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. గతంలో రూ.10వేలు మాత్రమే ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగంగా ఆ మొత్తాన్ని రూ.20 వేలు చేస్తామని హామీ ఇచ్చింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14తో సముద్రంలో వేట నిషేధిత సమయం పూర్తయ్యింది. కాని అర్హులైన మత్స్యకారుల ఖాతాల్లో సంధికాలపు భత్యం ఇంకా జమ కాలేదు. ఇదిలా ఉంటే గతంలో మాదిరిగా రూ.10వేలు ఇస్తారా, లేకుంటే రూ.20వేలు ఇస్తారా అనే విషయంపై గంగపుత్రులు చర్చించుకుంటున్నారు. జాప్యంపై జాలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 74 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. మత్స్యకార గ్రామాల ప్రజల్లో ఎక్కువ మందికి వేటే జీవనాధారం. మగవారు వేటాడిన మత్స్య సంపదను మహిళలు విక్రయాలు చేస్తుంటారు. సుమారు 232 మెకనైజ్డ్ బోట్లు, 2,431 మోటర్ బోట్లు, 247 సంప్రదాయ కర్ర తెప్పలు ఉన్నాయి. వీటిపై సారంగులు, కళాసీలు సుమారు 20వేల మంది వరకు ఉపాధి పొందుతుంటారు. సముద్రంలో సంధికాలం సమయంలో మత్స్యకారులు సాధారణంగా వలలు, బోట్లు మరమ్మతులు చేసుకుంటుంటారు. కొందరు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లో కొనసాగుతుంటారు. తప్పని పరిస్థితి అయితే బోటు యజమానుల వద్ద అప్పు చేస్తారు. లేదా ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో సందికాలం సమయంలో తాము చేసుకునే వలలు, బోట్ల మరమ్మతు పనులను కూడా ఉపాధిహామీ పథకంలో చేర్చితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని మత్స్యకార ప్రతినిధులు కోరుతున్నారు.


తీరంలో నిలిపిన బోట్లు (ఫైల్)

కొనసాగుతున్న వడపోత

ఈ ఏడాది లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది జాబితా వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంపై చెల్లింపుల ప్రక్రియ ఆధారపడి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.


మేదరమెట్లలో సీఐశివరామకృష్ణారెడ్డి సమక్షంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న సింథైట్ ప్రతినిధులు

కోరు రాకుండా చర్యలు తీసుకుంటాం

సీఐ, గ్రామస్థుల సమక్షంలో సింథైట్ యాజమాన్యం హామీ

మేదరమెట్ల, ఆగస్టు 9: సింథైట్ ఫ్యాక్టరీ నుంచి గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటామని, కోరు వచ్చే విభాగాలను పరిశీలించి అవసరం అయితే మూసివేస్తామని సింథైట్ ఆపరేషన్స్ హెడ్ హెల్‌తో కోమా అన్నారు. శుక్రవారం అద్దంకి రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌ల సమక్షంలో మేదరమెట్ల గ్రామస్థులు, సింథైట్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఫ్యాక్టరీ ఏర్పాటు నుంచి కోరుతో తాము పడిన అవస్థలు గురించి వివరించారు. పలుమార్లు కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. ఎట్టి పరిస్థితులలో కోరును అనుమంతించేది లేదన్నారు. ఆరోగ్యాలను పణంగా పెట్టి మీ ఫ్యాక్టరీని నడుపుకోవడానికి అనుమతించమని గ్రామస్థులు తెలిపారు. ఇన్ని రోజులగా అనుమతులు లేకుండానే మిరప వ్యర్థాలను వాడి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారన్నారు. గతం అ యిపోయింది, ఇప్పుడు ఫ్యాక్టరీలో కోరు వచ్చే మిరపకాయల గ్రైడింగ్ వద్ద కోరు రాకుండా అవసరం అయిన చర్యలు చేపడతామని, అందుకు నెల రోజులు సమయం ఇవ్వాలన్నారు. ఫ్యాక్టరీ నడిపేటప్పుడు కోరు వస్తే గతంలో పరిస్థితులు పునరావృతం అవుతాయని గ్రామస్థులు స్పష్టం చేశారు. కోరు రాకుండా భద్రతా పరమైన చర్యలు తీసుకున్నాక కూడా కోరు వస్తే ఆ విభాగాన్ని మూసి వేస్తామని, రాతపూర్వకంగా కలెక్టర్‌కు, గ్రామస్థులకు రాసిస్తామని హెల్‌తో కోమా తెలిపారు. ఆయనతో పాటు మనోహర్ అనే మధ్యవర్తి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆ యనకూడా రాతపూర్వకంగా ఇస్తున్నారు కాబట్టి కోరు వస్తే చర్యలు తీసుకుందామని గ్రామస్థులతో అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, మద్దాళి సంజీవరావు, రవ్వవరపు బ్రహ్మయ్య, చావా రాజేష్, ఆదూరి ప్రసాద్, మేదరమెట్ల చిన్న, శ్రీధర్, బోయపాటి శంకర్, పోకూరి హరి, కరుమూరి ప్రసాద్, కిలారు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకుందాం

- ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), ఆగస్టు 9 : సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీ ముత్తు మరియమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం కాలనీవాసులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కొండయ్యను ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ధి వెంకట బచ్చేశ్వరరావు, నాశిక వీరభద్రయ్య, భక్తులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూర మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్టు రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏరియా వైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


ముత్తు మరియమ్మ ఆలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ గోపికృష్ణ, సీఐ శ్రీనివాసరావు

పారదర్శకంగా పనిచేయండి

నిబద్ధతతో పాటు పారదర్శమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య తనను కలసిన అధికారులకు సూచించారు. చీరాల మండల తహసీల్దార్‌గా నియమితులైన గోపికృష్ణ, వన్‌టౌన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మారీదు శ్రీనివాసరావులు శుక్రవారం వేర్వేరుగా ఎమ్మెల్యే కొండయ్యను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కలను అందజేశారు. ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకితభావంతో పనిచేయటం మన ధర్మమన్నారు. అప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతామన్నారు. అందుకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

పంటలు తొలగించి వరి సాగు చేసుకుంటాం

● వ్యవసాయ అధికారులకు తెలిపిన రైతులు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని ముక్తేశ్వరం, చెన్నుపల్లిలలో పంట పొలాలను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే కంది, మొక్కజొన్న సాగు చేసినప్పటికి సాగుకు నీరు విడుదల జరుగుతున్నందున పంటలను తొలగించి వరి సాగు చేసుకుంటామని రైతులు తెలిపారు. గత ఏడాది లాగా సాగు నీరు రాదని మెట్ట పంటలు సాగు చేశామని తెలిపారు. మొక్కజొన్నలో మొవ్వ పురుగు గమనించి మొవ్వులో కారబోఫ్యురాన్ 3 జి గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున వేసి నివారించుకోవాలని మండల వ్యవసాయఅధికారి కుమారి సూచించారు. కత్తెర పురుగు ఉనికి గమనించడానికి ఎకరాకు 5 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలన్నారు. వీఏఏలు రోజా, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, వీఏఏలు


పోలేరమ్మ గుడి పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు9: యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామంలో శుక్రవారం పోలేరమ్మ గుడిపునః ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామస్థులు,పలువురు దాతల సహకారంతో దాదాపుగా 30 లక్షలు రూపాయలు వ్యయంతో నూతనంగా గుడి నిర్మాణం చేశారు.ఈ సందర్భంగా ఉదయాన్నే దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, యజ్ఞయాగాదులు నిర్వహించారు. దేవాలయంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొని దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ అర్చకులు పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం నిర్వహించారు.


పోలేరమ్మ తల్లి గుడి ప్రతిష్ఠలో ఎమ్మెల్యే ఏలూరి

నేడు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు


కుప్పుస్వామి విగ్రహం

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 9: విద్యాదాత, మానవతావాది జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ కారంచేడు గ్రామంలో శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మవిభూషణ్ గ్రహీత భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకటయ్య నాయుడు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రులు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

● మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి


కార్మికులకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న కమిషనర్ చక్రవర్తి

చీరాల, ఆగస్టు 9 : పట్టణంలో పారిశుధ్య చర్యలకు సంబంధించి ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు అందరాదని, అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి కార్మికులకు, శానిటరీ మేస్త్రీలకు స్పష్టం చేశారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపీటీలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు బిన్‌లు, చీపురులు, పారలు, పుష్‌కాట్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల సమయం. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజల ఆరోగ్యం కాపాడే మొదటి వైద్యులు మీరే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ , ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, శానిటరీ సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

59 మందిపై కేసుల నమోదు

● రూ.1.77 లక్షల అపరాధ రుసుం విధింపు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజయవాడ ఎస్ఈ ఆ ల్యాన్, ఒంగోలు డీపీఈ డీఈ వెంకటేశ్వర్లు, అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు డీఈ సురేంద్రబాబుల ఆధ్వర్యంలో 36 బృందాలు తనిఖీలు చేశాయి. 59 మందిపై కేసులు నమోదు చేసి 1.77 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించారు.


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

ఆర్యవైశ్య మహిళా సంఘ కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎన్నికైన మండల ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

చినగంజాం, ఆగస్టు 9 : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు చుండూరి గాయత్రి ఆధ్వర్యంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఎన్నికలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలుగా వలివేటి జ్యోతి, కార్యదర్శిగా కోట సుచిత్ర, కోశాధికారిగా అమరా నాగాలక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ్యం ఉపాధ్యక్షులు మోటుమర్రి రామసుబ్బారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట శివరామకృష్ణ, టీడీపీ , ఐటీడీపీ నాయకులు బయ్యా సతీష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



పలువురు ఎస్సైల బదిలీ

వీఆర్‌కు ఈపురుపాలెం సబ్‌ఇన్‌స్పెక్టర్

చీరాల, ఆగస్టు 9 : పలువురు ఎస్సైలను ఎస్పీ తుషార్ డూడీ బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అందులో భాగంగా చీరాల మండలం ఈపురుపాలెం ఎస్సై శివకుమార్‌ను వీఆర్‌కు పంపారు. ఆ స్థానంలో మేదరమెట్ల ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను నియమించారు. వేటపాలెం మండల ఎస్సైగా పనిచేస్తున్న సురేష్‌ను ఇంకొల్లు ఎస్సైగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును వేటపాలెం స్టేషన్‌కు బదిలీ చేశారు.

మార్టూరు రూరల్ సీఐగా శ్రీనివాసరావు



మార్టూరు, ఆగస్టు 9 : మార్టూరు రూరల్ సీఐగా జీఎల్ శ్రీనివాసరావును నియమించినట్లు శుక్రవారం గుంటూరు రేంజ్ పోలీసు ఉన్నత అధికారులనుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటివరకు మార్టూరు రూరల్ సర్కిల్‌కు సీఐగా సీతారామయ్య విధులలో ఉండగా ఆయనను బదిలీచేసి ఆయన స్థానంలో సీఐగా శ్రీనివాసరావును నియమించారు. ఇదిలా ఉండగా మార్టూరు రూరల్ సర్కిల్‌లో ఉన్న యద్దనపూడి, పర్చూరుస్టేషన్‌లను త్వరలో పర్చూరు సర్కిల్‌గా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

యద్దనపూడి ఎస్ఐగా రత్నకుమారి

మార్టూరు : యద్దనపూడి ఎస్ఐగా డి. రత్నకుమారిని నియమించినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.ప్రస్తుతం ఎస్ఐగా ఉన్న జీవీఎస్ చౌదరి బల్లికురవ ఎస్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో రత్నకుమారి అద్దంకి నుంచి యద్దనపూడిస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆమె గతంలోనూ యద్దనపూడి స్టేషన్ ఎస్ఐగా ఏడాదికిపైగా పనిచేశారు. తిరిగి ఆమెను యద్దనపూడి స్టేషన్‌కు నియమించారు.

పర్చూరు ఎస్సైగా సురేష్

పర్చూరు : పర్చూరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పి.సురేష్‌ను నియమించారు. సంతమాగులూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను శుక్రవారం పర్చూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్, చినగంజాంకు బదిలీ అయ్యారు.

ఇంకొల్లు ఎస్సైగా సురేష్

ఇంకొలు : ఇంకొల్లు ఎస్సైగా ప్రస్తుతం వేటపాలెం ఎస్సైగా పని చేస్తున్న జి.సురేష్‌ను నియమిస్తూ శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇంకొల్లు ఎస్సైగా పని చేస్తున్న మల్లికార్జునరావును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు అందాయి.



జీజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

రోగుల పట్ల నిర్లక్ష్యం వీడండి

సమాజంలో వైద్యులకు ఉన్న గౌరవం తగ్గింది..

● జీజీహెచ్‌లో వైద్యశాఖపై మంత్రులు సత్యకుమార్, నారాయణ సమీక్ష

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9: రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వీడాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతోమంది నిరుపేద రోగులు వస్తుంటారని, అలాంటి వారికి సేవాభావంతో చికిత్సలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జనరల్ ఆసుపత్రుల కంటే ఇక్కడ ఎంతో ఉన్నతంగా భవనాలు, వైద్య పరికరాలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నో రకాలుగా వైద్య చికిత్సలు అందించవచ్చని, అయితే కొందరు వైద్యుల తీరు సరిగా లేదన్నారు. గతంలో వైద్యులంటే దేవుడితో సమానంగా చూసేవారిని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇక్కడ వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తామని సత్యకుమార్ పేర్కొన్నారు. పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఉన్న వసతులను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్య చికిత్సలు అందివ్వాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌లు పలు సమస్యలపై మంత్రికి నివేదికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డిప్యూటీ సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● **డయాలసిస్ యూనిట్ ప్రారంభం**

నెల్లూరు జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఉదయం డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. రూ. 80 లక్షల ఖర్చుతో బయ్యా సరోనమ్మ పేరు మీద ఆమె కుమారులు బయ్యా రవికుమార్, బయ్యా శ్రీనివాసులు ఆరు పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. లయన్స్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించటం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. పొదలకూరు, వింజమూరులోనూ డయాలసిస్ యూనిట్‌లు కావాలని అడుగుతున్నారని, త్వరలో అక్కడ ప్రారంభిస్తామన్నారు. జీజీహెచ్ సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ వసుంధరాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, బీజేపీ నేతలు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.



నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

జిల్లావ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చనలు జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భారీగా ప్రసాద వితరణ, అన్నదానం జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను అరటి పిలకలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించి, శ్రావణలక్ష్మీని భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు.

జిల్లాలోని ఎస్ఐలకు స్థానచలనం

● పలువురిని బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వుల జారీ

నెల్లూరు,(క్రైం),అగస్టు9: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 22 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే ఆయా కేంద్రాల్లో చేరాలని ఎస్పీ పేర్కొన్నారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీఅయిన ప్రాంతం
పీ ఆదిలక్ష్మి	జలదంకి	దుత్తలూరు
ఎం ఉమాశంకర్	దుత్తలూరు	కలిగిరి
ఎం సంతోష్‌రెడ్డి	కలిగిరి	వీఆర్, నెల్లూరు
కే భోజ్యా	బిట్రగుంట	కొండాపురం
బీ మహేంద్ర	కొండాపురం	వీఆర్, నెల్లూరు
కే నాగార్జునరెడ్డి	సంగం	ఇందుకూరుపేట
జీ వీరేంద్రబాబు	ఇందుకూరుపేట	టీపీ గూడూరు
జంపాని కుమార్	టీపీ గూడూరు	దగదర్తి
కే మరిడినాయుడు	దగదర్తి	కందుకూరు టౌన్
ఏ ఆనందభాస్కర్	కందుకూరు టౌన్	వీఆర్, నెల్లూరు
బీ బాల మహేంద్రనాయక్	వలేటివారిపాలెం	కందుకూరు రూరల్
పీ నరేష్	కందుకూరు రూరల్	విడవలూరు
ఎం రాజా	విడవలూరు	వీఆర్, నెల్లూరు
టీ విశ్వనాథ్‌రెడ్డి	మర్రిపాడు	ముత్తుకూరు
ఎం శివశంకరరావు	నార్త్‌ట్రాఫిక్	రాపూరు
జీ మాల్యాద్రి	రాపూరు	వీఆర్, నెల్లూరు
పీ శ్రీనివాసులరెడ్డి	అల్లూరు	ఆత్మకూరు పీఎస్ ఎస్ఐ-1
కే ముత్యాలరావు	ఆత్మకూరు పీఎస్ ఎస్ఐ-1	వీఆర్, నెల్లూరు
ఏ సైదులు	చిన్నబజారు	ఏఎస్‌పేట
కే ప్రసాద్‌రెడ్డి	ఏఎస్‌పేట	వీఆర్, నెల్లూరు
పీ అనూష	సీతారామపురం	సోమశిల
వీ సుబ్బారావు	సోమశిల	వీఆర్, నెల్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించండి

● సీఎండీ సంతోష్‌రావు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 9: సౌర విద్యుత్ తయారీకి ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తున్నందున, దాని ఏర్పాటుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ అధికారులను సీఎండీ సంతోషరావు ఆదేశించారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేల రాయితీని ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. ఈ విషయమై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ట్రాన్స్‌పార్మర్ల పేలుళ్లను తగ్గించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులంతా విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్‌లో ద్వారా చెల్లించేలా వారిని చైతన్య పరచాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, ఎస్ఈ విజయన్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు తీసుకోవడమే కాదు..

అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తాం!

● ప్రజా సమస్యల పరిష్కారవేదికలో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 9: ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడమే కాదు... అక్కడిక్కడే సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తిక్కన భవన్‌లో మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసమే సీఎం చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ వేదికలో దరఖాస్తులు తీసుకోవటమేకాదు వాటికి స్పాట్‌లోనే పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ పరిష్కార వేదికలో ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయని చెప్పారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించామన్నారు. కొన్నింటిని కేబినేట్ స్థాయిలో పరిష్కరించాలని మంత్రి చెప్పారు. పోలీసు, రెవెన్యూ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అనేక సమస్యలు వచ్చాయని తెలిపారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితిల్లోనూ వదిలేది లేదని నారాయణ హెచ్చరించారు. గత ఐదేళ్లలో వైసీపీ కనిపించని ప్రజా పాలన చేసిందన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై విచారించి చట్టపరంగా చర్యలు చేపడతామని చెప్పారు. అర్జీలు స్వీకరించిన మంత్రి కొన్నింటిని స్పాట్‌లోనే పరిష్కరించారు. మరికొన్నింటిని విచారించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రితోపాటు కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నగర కమిషనర్ సూర్యతేజ తదిరులు పాల్గొన్నారు.కాగా వేదిక కార్యక్రమాన్ని తొలుత శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించినా, సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించడం విశేషం.

వ్యవసాయ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

● ఆత్మకూరు, ఉదయగిరిలో రైతు సంఘం నాయకుల ఆందోళన

ఆత్మకూరు, ఆగస్టు 9: కేంద్రం చేపట్టనున్న వ్యవసాయ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వివిధ కార్మిక సంఘాల నేతలు క్విట్ కార్పొరేట్ నినాదాలతో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడారు. వ్యవసాయరంగ ప్రైవేట్ శక్తులకు అప్పగించే నిర్ణయంతోనే ఎరువుల సబ్సిడీని తగ్గించడం, పంటలకు మద్దతు ధర ప్రకటించక పోవడమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరు నాగయ్య, డేవిడ్ రాజు, నాగేంద్ర, యువజన కాంగ్రెస్ నాయకుడు వన్నం నాగరాజు, ఐద్వా నాయకులు లక్ష్మమ్మ, పద్మ, ఆటో వర్కర్స్, టైలర్స్ యూనియన్ నాయకులు రమణయ్య, మహబూబ్‌బాషా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఉదయగిరి రూరల్: వ్యవసాయ రంగాన్ని కేంద్రం కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా చూడాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రైతులతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. ప్రధాని మోదీ రైతుల ఆదాయం రెట్టింపు, ఆత్మహత్యలు లేకుండా చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు పంటలకు మద్దత ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలాయన్నారు. రైతు, కౌలు రైతులకు వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సబ్సిడీతో ఎరువులు అందజేయడంతో పాటు పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు. పేదల భూములను ఉపాధి పనులతో అభివృద్ధి చేయాలన్నారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, ఫరుద్దీన్‌బాషా, గడ్డం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి: డీఈవో


సంగం: విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

ఏఎస్ పేట, ఆగస్టు 9: ఉన్నత విద్యనందించి విద్యార్థుల సామర్థ్యంను మెరుగుపర్చాలని డిప్యూటీ డీఈవో గోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన చిరమన జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యంను తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం: కొరిమెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. శిథిలావస్థ భవనంతో ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో జానకిరాం ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

కలువాయి, ఆగస్టు 9: స్థానిక బస్టాండు రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు అధిక లోడ్‌తో వెళుతున్న వాహనం తగిలి తెగిపడ్డాయి. ఈ సమయంలో జనం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కాలంలో చాలాసార్లు ఈ తీగలు తెగిపడ్డాయి. విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం వాపోతున్నారు. మండల జనసేన నాయకులు ఈ విషయాన్ని మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నేడు సరఫరాలో అంతరాయం

శనివారం కలువాయి, చింతలాత్మకూరు, కుల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు, 11కేవీ లైన్ వెంబడి చెట్లు తొలగింపు పనులతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు డీఈ ఏ.రవికుమార్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు గమనించి అందుకు సహకరించాలని కోరారు.

కావలి: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కావలి పట్టణం, రూరల్ మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు డీఈఈ శ్రీనివాసులు రెడ్డి, టౌన్ ఏఈ వసంతరావులు ఒక ప్రకటనలో తెలిపారు.

వింజమూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్ ప్రారంభించి వృద్ధుడికి భోజనం వడ్డిస్తున్న నాయకులు

వింజమూరు, ఆగస్టు 9: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దాతృత్వంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, ఉదయగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ చంద్ర మధుసూదన్ రావు, మాజీ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చెంచలబాబుయాదవ్ మాట్లాడారు. మూడేళ్లుగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అందులో భాగంగానే ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ కుర్రి రవీంద్రబాబు, రఘునాధరెడ్డి, దంతులూరి వెంకటేశ్వర్లు, సీహెచ్ బయ్యన్న, ప్రభాకర్‌రాజు, చల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, ఆగస్టు 9: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం నాగరాజు, పట్టణ కార్యదర్శి హజరత్తయ్య మాట్లాడారు. మున్సిపాలిటీ విభాగాల కార్మికులకు జీతాలు పెంచాలని, యూనిఫారం దుస్తులు, సబ్బులు, చమురు, పాదరక్షలు ఇవ్వాలని కోరారు. ఈపీఎఫ్ రశీదులు అందజేయాలన్నారు. ఈ మేరకు కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మునీర్‌బాబు, ఉపకార్యదర్శి చెంచయ్య, ట్రెజరర్ కృష్ణయ్య పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వింజమూరు, ఆగస్టు 9: ధరిణి సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తూరులో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధరణి సేవా సమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్ యల్లాల వెంకటరామిరెడ్డి, ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్ట్ యల్లాల మంజుల చొరవ, కొత్తూరు రిలయన్స్ ఫౌండేషన్ వితరణతో స్థానిక ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, యల్లాల శ్రీనివాసులరెడ్డి, గూడా నర్సారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, గుణ్ణం ప్రసాద్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గణపం రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఆత్మకూరు, ఆగస్టు 9: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, పల్లవోలు జయాకర్ తెలిపారు. చింతగుంట గోపాల్‌రెడ్డి వితరణగా అందజేసిన ప్లేట్లు, గ్లాసులు, పలకలను శుక్రవారం ఆయన శాంతినగర్, నరసాపురం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పంపిణీ చేశారు. చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, అల్లంపాటి వెంకటేశ్వర్లురెడ్డి, అల్లంపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.


చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న నేతలు

సీఐ గంగాధర్‌కు సన్మానం


సీఐ గంగాధర్‌ను అభినందిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 9: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రావును శుక్రవారం టీడీపీ నేతలు కలిసి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్ష, కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మద్దినేని నారాయణ, టీఎస్ ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల మారుతి నాయుడు, రాచూరు రమణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అనంతసాగరం, ఆగస్టు 9: బొమ్మవరం, లింగంగుంట రైతు సేవాకేంద్రాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా సాంకేతిక యాజమాన్య పద్ధతులతో సాగుచేసే పద్ధతులను వివరించారు. భూమి విషతుల్యం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శైలజకుమారి, గీతాకుమారి, శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మెట్టుకూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు చేయండి

సీతారామపురం, ఆగస్టు 9: రైతులు సాగు చేసిన పంటలను త్వరితగతిన ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం అయ్యవారిపల్లిలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సాగులోని మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారి చేయాలన్నారు. సబ్సిడీ డ్రిప్పు పరికరాల కోసం రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పెళ్లి రోజును పురస్కరించుకొని విద్యార్థులకు చికెన్ బిర్యానీ, స్వీట్, వడ, ఐస్‌క్రీమ్, అరటిపండు అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, హెచ్‌ఎం బలరామయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సంగంలో మంత్రి పర్యటన

సంగం, ఆగస్టు 9: మండలంలో శనివారం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించనున్నట్లు డీపీఆర్వో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు దువ్వూరు నేషనల్ హైవే సమీపంలో నిర్మించిన శ్రీమల్లి మిల్క్ డెయిరీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

దుత్తలూర(ఉదయగిరి రూరల్), ఆగస్టు 9: విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలను చేరుకునేలా లక్ష్యాలను నిర్ణయించుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుత్తలూరు, వరికుంటపాడు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాబోధన చేసే సమయంలో శ్రద్ధగా వినాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీడ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రియాజ్‌కు సన్మానం



రియాజ్‌ను సన్మానిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు శుక్రవారం టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌ను కలిసి సన్మానించారు. టీడీపీ సానుభూతిపరుల విజయానికి సహకరించడంతో ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ సందానీ, ఖాదర్‌బాషా, నవాజ్ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం గండిపాళెం జిల్లా పరిషత్, మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల యాజమాన్య కమిటీలతో సమావేశమై అభివృద్ధికి సలహాలు అందజేశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు.

మెలకువలతో పంట సాగు చేయాలి

మర్రిపాడు, ఆగస్టు 9: రైతులు మెలకువలతో పంటలు సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్ర ఏడీ మారుతీదేవి శుక్రవారం పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల రైతులకు శిక్షణ ఇచ్చారు. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా సాగులో మార్పులు చేయాలని వివరించారు. రైతులు సుస్థిర ఆదాయం పొందేందుకు పశుగ్రాసాల సాగు, పెరటి కూరగాయలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ మధురిమ, మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ● కావలిలో ఘన స్వాగతం

కావలిటౌన్, ఆగస్టు 9: రాష్ట్రాన్ని వికసిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు పర్యటనకు వెళుతున్న మంత్రికి పట్టణ సమీపంలోని మద్దూరుపాడు జాతీయ రహదారిపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీజేపీ శ్రేణులతో కలిసి అల్పాహార స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ హామీలు నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని, దానిని జీర్ణించుకోలేని వైసీపీ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్‌డీ విల్సన్, కంచర్ల మురళీకృష్ణ, వీవీ రంగారెడ్డి, బ్రహ్మానందం, కమల, మాధవి, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది.


కావలిలో మంత్రి సత్యకుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

కందుకూరు : రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నెల్లూరులో కందుకూరు నియోజకవర్గ బీజేపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి గట్టమనేని హరిబాబు, పార్టీ నేతలు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, పీవీ కృష్ణారెడ్డి, చుండి మురళీధర్, మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున కోరారు. ఈ మేరకు నెల్లూరు పర్యటనకు వెళుతూ మార్గమధ్యంలో కావలిలో ఆగిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. 23 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం గోడలు దెబ్బతిన్నాయన్నారు. మండలం చుట్టుపక్కల 50 కిలోమీటర్లలోపు మంచి వైద్యశాలలు లేవని, 45 వేలకుపైగా జనాభా ఉన్న మండలానికి 30 పడకలతో 24 గంటలు వైద్యం అందేలా నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. చింతలదీవి సమీపంలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా చినమాలకొండయ్య, కొమ్మి కోటయ్య, హనుమారెడ్డి తదితరులు ఉన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం పీహెచ్‌సీలో పరికరాలు, మందుల కొరత సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఘట్టమనేని హరిబాబు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, చంద్రశేఖర్, ప్రసాద్, వైకుంఠం పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, ఆగస్టు 9 : మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాగునీరు, లోవోల్టేజీ, చేతి పంపులు, వీధి దీపాలు, తదితర సమస్యలపై చేవూరు, గుడ్లూరు, పొజర్ల, రాళ్లపాడు గ్రామ సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గుడ్లూరు మెయిన్ బజార్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఉలవపాడు ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. ముందుగా గుడ్లూరులోని గంగపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం పునఃనిర్మాణానికి చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీపీ పులి రమేష్, తహసీల్దార్ స్వర్ణలత, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉపాధి హామీ కూలి చెల్లించాలి

కావలిటౌన్, ఆగస్టు 9: మూడు నెలల ఉపాధి హామీ కూలి డబ్బులు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఉపాధి హామీ కూలి డబ్బులు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రం బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించిందని, అందులో బకాయిలు రూ.41వేల కోట్లు పోతే మిగిలిన రూ.45వేల కోట్లు ఏమూలకు వస్తాయని ప్రశ్నించారు. వికసిత్ భారత్ అంటే వ్యవసాయ కూలీలు ఆకలితో అలమటించడమేనా అని ఆవేదన చెందారు. సమావేశంలో నాయకులు సీతారామయ్య, రాధాకృష్ణయ్య, జాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 9: విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో శుక్రవారం వ్యవసాయంపై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సహోపాధ్యాయులు రేణుక, శివపార్వతి తదితరులు ఉన్నారు.

ఆదివాసులు ప్రకృతి కన్నబిడ్డలు : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 9: ప్రకృతి కన్న బిడ్డలు ఆదివాసులని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు వెనుక వీధిలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి కల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ పూర్వం అందరం ఆదివాసులేనని, నాగరికత పెరిగే క్రమంలో ప్రాంతాలు, ఆచార వ్యవహారాలు, చేసే వృత్తులు, జీవన విధానాలను బట్టి మనుషులు వర్గాలుగా విభజింపబడ్డారన్నారు. మొగలి కల్లయ్య విన్నపం మేరకు వచ్చే ఏడాది ఆదివాసి దినోత్సవం నాటికి కావలి పట్టణంలో ఏకలవ్యుడి విగ్రహాన్ని తన స్వీయ నిధులతో ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికులు ఆదివాసులని, అడవి తల్లి వడిలో వదికిపోయిన కల్మషం లేని మనుషులన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నేతలు బోగిరి యోహాన్, ప్రభాకర్, టీ రవి, టీడీపీ నేతలు జ్యోతి బాబురావు, గుత్తికొండ కిషోర్, తిరివీధి ప్రసాద్, అర్షియా తదితరులు పాల్గొన్నారు.


నెమలి ఈకలు, క్యాడ్‌బాళ్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే

గిరిజనుల హక్కులు కాపాడుకోవాలి

బిట్రగుంట : అనగారిన గిరిజనుల జీవితాలు మారాలంటే మొదట హక్కుల కోసం పోరాటం చేయాలని గిరిజన నాయకుడు కావాటి శ్రీనివాసులు అన్నారు. బోగోలు మండలం కప్పరాళ తిప్ప సమీపంలోని రామాపురం కూడలిలో ప్రపంచ ఆదివాసుల దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలు వేసి పుష్పాంజలి ఘటించారు.

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన

కావలి రూరల్, ఆగస్టు 9 : మండలంలోని రుద్రకోటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. గోశాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మునగాల జగన్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కాండ్ర కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట : బోగోలు మండలం నాగులవరంకు చెందిన టీడీపీ జిల్లా నేత కాండ్ర రఘురాం నాయుడు తల్లి కాండ్ర రాగమ్మ (94) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచు గనేషం రమేష్‌రెడ్డి, నేతలు చిలకపాటి వెంకటేశ్వర్లు, గనిపినేని నాగరాజు, లకాకుల మాధవరావు, పుట్టా సుబ్బారావు, క్రాంతి తదితరులు ఉన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

● ఎస్ఆర్‌డీఏ జేడీ రామనాథం

కందుకూరు, ఆగస్టు 9: మండలంలోని మహదేవపురంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎస్ఆర్‌డీఏ జేడీ రామనాథం అన్నారు. శుక్రవారం ఆయన ఆ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు బెడ్‌లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కేంద్రం నిర్వహణ చక్కగా ఉన్నందున ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మొక్కలు, పూలచెట్లు పెంచాలని సూచించారు. నీటిసౌకర్యం ఉన్నందున కూరగాయల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం రాబట్టాలని తెలిపారు. ఈ కేంద్రం మిగిలిన గ్రామపంచాయతీలకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.ప్రమీలారాణి, ఈవోఆర్డీ ఎస్.చంద్రసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ రీసెర్చ్ కో ఆర్డినేటరు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామనాథం

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, ఆగస్టు 9: పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్పీడీవో శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కావలి ఎమ్పీడీవో కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణలో పంచాయతీల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం రుద్రకోటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఎస్‌కె. అబ్దుల్ సమద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎమ్పీడీవో

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

అల్లూరు : గ్రామీణాభివృద్ధి జరగాలంటే ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాల్సిన అసరముందని, ప్రధానంగా సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచెలకు చేపట్టిన శిక్షణ తరగతుల్లో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పరిశుభ్రత, సంపద తయారీలపై గ్రద్దగుంట పంచాయతీలో ప్రయోగాత్మకంగా చేపట్టి వివరించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

కావలిటౌన్, ఆగస్టు 9: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అడిషినల్ జుడిషియల్ న్యాయాధికారి విక్రమ్ సిన్హా పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీసాయి కళాశాలలో మాదక ద్రవ్యాలనిర్మూలన అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి పరశురామ్, న్యాయవాది కెనడి, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ వలి తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి విక్రమ్ సిన్హా

గర్భిణులకు టానిక్‌ల పంపిణీ

కావలి, ఆగస్టు 9: గర్భిణులు, బాలింతలకు స్థానిక వెంగళరావునగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పీఎం సురక్షిత మాతృత్వ పథకంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి ఐరన్‌ఫోలిక్, కాల్షియమ్, విటమిన్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి మాలినీదేవి, డాక్టర్ రమ్య, రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సీవో ప్రసాద్, సుగుణమ్మ పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో పీఎం మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జిహారిక, వైద్యులు నిత్యప్రశాంతి, ప్రవీన్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కులు పాల్గొన్నారు.

ఒకటో పట్టణ సీఐ బాధ్యతల స్వీకరణ

కావలి, ఆగస్టు 9: కావలి ఒకటో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎండీ ఫిరోజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ రాజేష్ ఇక్కడ నుంచి బదిలీ కాగా ఆయన స్థానంలో కలిగిరి సీఐగా ఉన్న ఫిరోజ్‌ను నియమించారు.

కందుకూరు సీఐ..

కందుకూరు : కందుకూరు సీఐగా కె.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం పట్ల తనకు అవగాహన ఉందని, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతామన్నారు.

గుడ్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్..

గుడ్లూరు : గుడ్లూరు సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మంగారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న సుబ్బారావు రేంజ్ కార్యాలయానికి బదిలీ కావడంతో పల్నాడు జిల్లా పెద్దకూరపాడు సర్కిల్‌లో పనిచేస్తున్న జి.మంగారావు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్లబండి పోటీలు

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 9: దగదర్తి గ్రామంలో వెలసి ఉన్న గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం ఎడ్లబండి పరుగు పందాలు నిర్వహించారు. దగదర్తి మండలమే కాకుండా ఇతర మండలాల నుంచి దాదాపు 32 జతల ఎడ్లబండ్లు పోటీలో పాల్గొన్నాయి. తూర్పుపల్లె పాలెం పాటూరు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతకు మాలేపాటి భానుచందర్ నాయుడు, సుధాకర్ నాయుడులు రూ.20 వేల, ట్రోఫీ అందచేశారు. ద్వితీయ స్థానంలో యల్లాయపాలెం ఎడ్లకు రూ.15 వేలు, మూడవ స్థానంలో నిలిచిన కోవూరు ఎడ్లకు రూ.10 వేలు, 4వ స్థానంలో ముదివర్తి రూ.8 వేల, ఐదవ స్థానంలో యల్లాయపాలెం రూ.6 వేల గెలుచుకున్నారు. సాయంత్రం గెలుపొందిన వారికి పెద్దలు మారుబోయిన శ్రీనివాసులు, కాకర్ల ప్రభాకర్, వింజం కొండపనాయుడు, మెత్తాళ్ల సురేష్, బహుమతులను అందచేశారు.



బహుమతి అందజేస్తున్న టీడీపీ యువనేత భానుచందర్‌నాయుడు